ANN తెలుగు
Follow: @ANNTELUGU
16-03-2026
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 78 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## దద్దరిల్లుతున్న పశ్చిమాసియా

ఇరాన్ అణుకేంద్రనగరం ఇస్ఫహాన్ పై అమెరికా భీకర దాడి

దుబాయ్ కువైట్ ఎయిర్ పోర్టులపై ఇరాన్ డ్రోన్ల దాడి

భీకరంగా సాగుతున్న యుద్ధం

అమెరికా, ఇజ్రాయెల్ తప్ప అందరికీ జలసంధి


**మహా నెట్ వర్క్:** అమెరికాఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం మొదలై 16వ రోజుకు చేరుకుంది. పశ్చిమాసియాలో పరస్పర దాడులతో ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు సైనిక కేంద్రాలే లక్ష్యంగా సాగిన దాడులు, ఇప్పుడు చమురు క్షేత్రాలపై గురి పెడుతున్నాయి. ఇరాన్ మిలిటరీ సదుపాయాలు, చమురు క్షేత్రాలే లక్ష్యంగా ఇజ్రాయెల్, అమెరికా దాడులు కొనసాగుతున్నాయి.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

నెతన్యాహు ఎక్కడున్నా **చంపేస్తాం**
- ఇరాన్ డెత్ వార్నింగ్

02




కేటీఆర్ కూడా **డ్రగ్స్ టెస్ట్‌కు రెడీ అవ్వాలి**
- పీసీసీ చీఫ్ షాకింగ్ కామెంట్స్

02



రేవంత్‌రెడ్డి జూనియర్ యోగిలా **మారారు**
- హరీశ్‌రావు విమర్శలు

02



# మిస్టర్ రంగనాథ్

## దమ్ముందా.. బుల్డోజర్ తియ్

ఆదిత్య రియల్టర్స్ పైకి పోదాం పదా..

నేను ఆన్ లైన్ లో పెడితే.. దుంకి చస్తరు

హైడ్రా కమిషనర్ కు కవిత వార్నింగ్

ప్రజల ప్రాణాలకు ముప్పు ఉందని రాసి.. సిగ్గుందా?

**హైదరాబాద్, మహా:**

'మిస్టర్ రంగనాథ్ మిమ్మల్ని మేము కోర్టుకు ఈడిస్తాం. ఆరు ఫిర్యాదులు చేస్తే వాటిపై చర్యలు తీసుకునేందుకు మీ ధైర్యం ఎక్కడికి పోయింది? గతంలో మీరిచ్చిన లేఖను నేను బయట పెడితే మీరు మీ ప్రభుత్వం దూకి చస్తారు'. ఆదిత్య రియల్టర్స్ పైకి వెళ్లేందుకు దమ్ముందా . పద వెళ్దాం బుల్డోజర్లు తీసుకుని రా అంటూ తెలంగాణ జాగృతి చీఫ్ కల్వకుంట్ల కవిత ఫైర్ అయ్యారు. మీరేమైనా గ్రాఫిక్ డిజైనర్లా? కంటెంట్ క్రియేటర్లా? నిజం మాట్లాడితే ఇష్టం వచ్చినట్లు ఎదురుదాడి చేయడం తమాషా అయిపోయిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి వచ్చాక హైడ్రా అనే మహమ్మారిని తీసుకువచ్చారని తెలంగాణ జాగృతి చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. జాగృతి కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత.. ఇటీవల తాము గండిపేట మండలం నార్సింగ్‌లో ఓ ప్రైవేట్ సంస్థ మూసీ నది మధ్యలో నిర్మాణాలు చేపడుతుంటే ఆందోళన చేస్తే హైడ్రా మమ్మల్నే బద్నాం చేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మా ధర్నా తర్వాత హైడ్రా నాలుగైదు వీడియోలు రిలీజ్ చేసింది. నేను హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సీరియస్‌గా చెబుతున్నాను. ఆధారాలు లేకుండా నేను ఏమి మాట్లాడను. నార్సింగ్‌లో మార్చి 3వ తేదీన ధర్నా చేస్తే ఆ మరుసటి రోజు స్పందిస్తూ ఈ ప్రాపర్టీకి హైడ్రాకు సంబంధం లేదని, హైడ్రా రాక ముందే దీనికి అనుమతులు వచ్చాయి కాబట్టి మాకు సంబంధం లేదని చెబుతున్నారు.



మిగతా 2లో

# మోగిన ఎన్నికల నగారా

## ఐదు రాష్ట్రాల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

ఏప్రిల్ 9న కేరళ, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు

మూడు రాష్ట్రాల ఎన్నికలకు నేడు నోటిఫికేషన్.. వారంలో నామినేషన్ల ఘట్టం పూర్తి

23న తమిళనాడు ఒకే విడత.. 23, 29 తేదీల్లో పశ్చిమబెంగాల్ రెండు దశలు

సుదీర్ఘంగా కాకుండా.. సింపుల్ గా ఎన్నికల షెడ్యూల్.. మే 4న రిజల్ట్

17.4కోట్ల ఓటర్లు.. 25లక్షల మంది అధికారులు సీఈసీ జ్ఞానేశ్‌కుమార్

**ఢిల్లీ, మహా**

దేశంలో ఎన్నికల నగారాను కేంద్రం మోగించింది. పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల తేదీలను భారత ఎన్నికల సంఘం వెల్లడించింది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీలు ఆదివారం సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటు చేసి షెడ్యూల్ అనౌన్స్ చేశారు. తమిళనాడు (234), పశ్చిమ బెంగాల్ (294), కేరళ (140), అస్సాం (126)తోపాటు పుదుచ్చేరి (30) రాష్ట్రాల్లో మొత్తంగా 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. పుదుచ్చేరితోపాటు నాలుగు రాష్ట్రాల శాసనసభల పదవీకాలం మే, జూన్‌లలో వేర్వేరు తేదీల్లో ముగియనుంది. "ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతంలో పర్యటించాం. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు పార్టీల నేతల సలహాలు స్వీకరించాం.

మిగతా 2లో



**నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరిలో ఇలా..**

| | |
|---|---|
| మొత్తం ఓటర్ల సంఖ్య | 17.4 కోట్లు |
| మొత్తం అసెంబ్లీ స్థానాలు | 824 |
| పోలింగ్ స్టేషన్లు | 2.19 లక్షలు |
| ఎన్నికల అధికారులు | 25 లక్షలు |

**పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్**

మొత్తం నియోజకవర్గాలు: 30

గెజిట్ నోటిఫికేషన్ విడుదల తేదీ: 16 మార్చి 2026 (సోమవారం)

నామినేషన్ల దాఖలు చివరి తేదీ: 23 మార్చి 2026 (సోమవారం)

పోలింగ్ తేదీ: 09 ఏప్రిల్ 2026 (గురువారం)

ఓట్ల లెక్కింపు తేదీ: 04 మే 2026 (సోమవారం)

**కేరళ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్**

మొత్తం నియోజకవర్గాలు : 140

గెజిట్ నోటిఫికేషన్ విడుదల తేదీ: 16 మార్చి 2026 (సోమవారం)

నామినేషన్ల దాఖలు చివరి తేదీ: 23 మార్చి 2026 (సోమవారం)

పోలింగ్ తేదీ: 09 ఏప్రిల్ 2026 (గురువారం)

ఓట్ల లెక్కింపు తేదీ: 04 మే 2026 (సోమవారం)

# డ్రగ్ టెస్ట్‌లో ఏలూరు ఎంపీకి పాజిటివ్

పుట్ట మహేష్ అరెస్ట్.. స్టేషన్ బెయిల్.. ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు

పుట్టా మహేష్‌ను సస్పెన్షన్‌కు విపక్షాల డిమాండ్

పార్లమెంట్ జరుగుతుంటే కొకైన్ తో విందుచిందా? షర్మిల ఫైర్



**హైదరాబాద్, అమరావతి, మహా:**

తెలంగాణలోని మొయినాబాద్ ఫామ్‌హౌజ్ వేదికగా జరిగిన డ్రగ్స్ పార్టీ వ్యవహారం ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసులో ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ పాల్గొనడం, తాజాగా ఆయనకు నిర్వహించిన రక్త పరీక్షల్లో డ్రగ్స్ పాజిటివ్ అని తేలడంతో విపక్షాలు ఒక్కసారిగా విరుచుకు పడుతున్నాయి. కాగా మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో టీడీపీ నేత, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌కు స్టేషన్ బెయిల్ మంజూరయ్యింది. సోమవారం నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఉన్న నేపథ్యంలో ఆయనకు స్టేషన్ బెయిల్ ఇచ్చారు. టీడీపీ ఎంపీతో పాటు ప్రియాంక రెడ్డికి బెయిల్ వచ్చింది. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ పార్టీని శనివారం రాత్రి పోలీసులు భగ్నం చేసిన విషయం తెలిసిందే. పార్టీ జరుగుతుందనే పక్కా సమాచారంతో ఈగల్ టీమ్, ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు అక్కడకు చేరుకున్నారు.

మిగతా 2లో

# నేటి నుండి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రసంగం

20న బడ్జెట్ ? నెలాఖరు వరకు సమావేశాలు

ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పండుగల నడుమ సభ

**హైదరాబాద్, మహా:** తెలంగాణ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఉదయం 11:45 గంటలకు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ప్రసంగిస్తారు. అనంతరం బీఏసీ సమావేశం నిర్వహిస్తారు. సభ ఎన్ని రోజులు నిర్వహించాలనే అంశంపై బీఏసీలో నిర్ణయం తీసుకుంటారు. ఈ నెల 20వ తేదీన శాసన సభలో, మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరు వరకు బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. బడ్జెట్ సమావేశాలు అత్యంత ముఖ్యమైనవని, ఎక్కువ రోజులు జరగడంతో పాటు ఎక్కువ సమయం పాటు జరుగుతాయని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,

మిగతా 2లో



# మీ ఆశీస్సులు ప్రభుత్వానికి కావాలి

కలిసిమెలిసి తెలంగాణను ముందుకు తీసుకెళ్దాం

ఇఫ్తార్ విందులో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** మతాల మధ్య చిచ్చు పెట్టడం తెలంగాణ రాష్ట్రంలో చెల్లదని కాదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో కొంతమంది మతాల మధ్య కొట్లాటలు పెట్టి రాజకీయంగా లబ్ధి పొందాలను చూస్తున్నారని ఫైర్ అయ్యారు.

మిగతా 2లో



## రైతు భరోసా డేట్ వచ్చేసింది

- 22 నుండి ఖాతాల్లోకి నిధులు
- అన్నదాతలకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త

వివరాలు 8లో



## రేవంత్‌రెడ్డి జూనియర్ యోగిలా మారారు

**.. హరీశ్‌రావు విమర్శలు**

**హైదరాబాద్, మహా :** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండున్నర సంవత్సరాల్లో ఒక్క ఇల్లు కట్టలేదు కానీ లక్ష ఇళ్లను కాంగ్రెస్ సర్కార్ కూల్చిందని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి జూనియర్ యోగిలాగా (ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్) మారారని ఎద్దేవా చేశారు. బుల్డోజర్లతో ఇళ్లను కూల్చడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహించారు. కేసీఆర్‌ది అభివృద్ధి మంత్రం అయితే రేవంత్‌రెడ్డిది విధ్వంసమని ఆరోపించారు. ఆదివారం ముషీరాబాద్ భోలక్‌పూర్‌లో అంజుమన్ గర్ల్స్ హైస్కూల్‌లో నిర్వహించిన రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ముస్లిం మహిళలకు రేషన్ కిట్స్ అందజేశారు. హరీశ్‌రావు వెంట ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్సీ సలీం ఉన్నారు.

## నేటి నుండి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌లు పేర్కొన్నారు. సభ లోపల, బయట కూడా ప్రశాంత వాతావరణం ఉంటేనే సమావేశాలు సాఫీగా జరుగుతాయని వారు స్పష్టం చేశారు. అనుకోని సంఘటనలు, అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభుత్వానికి, శాసనసభకు మంచి పేరు తీసుకువచ్చేలా పని చేయాలని అధికారులకు, శాసనసభ, మండలి కార్యదర్శులకు సూచించారు. సమావేశాలు సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర మూడో శాసనసభ ఎనిమిదో సమావేశాలు, తెలంగాణ శాసన మండలి 26వ సమావేశాల నేపథ్యంలో నిర్వహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులతో ఈరోజు శాసనసభ భవనంలోని కమిటీ హాల్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు.

## కేటీఆర్ కూడా డ్రగ్స్ టెస్ట్ కు రెడీ అవ్వాలి

**పీసీసీ చీఫ్ షాకింగ్ కామెంట్స్**

**హైదరాబాద్, మహా :** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌజ్‌లో జరిగిన కొకైన్ పార్టీపై తెలంగాణ కాంగ్రెస్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఈగల్ బృందం కర్తవ్యాన్ని నెరవేరుస్తోంది. రాజకీయాలకు అతీతంగా పని చేస్తోంది. మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై కేటీఆర్ బృందం సమాధానం చెప్పాలి. ప్రజలు, డ్రగ్స్ రహిత సమాజం కోసం ఈగల్ టీమ్ దాడులు చేస్తోంది. కేటీఆర్, ఆయన అనుచరులు డ్రగ్స్ తీసుకుంటున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అవసరమైతే కేటీఆర్ డ్రగ్స్ పరీక్షలకు సిద్ధం కావాలి. అసెంబ్లీ సమయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరం డ్రగ్స్ టెస్టులు చేసుకుని లోనికి వెళ్దాం. డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారు. ఆ ప్రయత్నానికి మనవంతు సాయం చేయాలి కానీ.. పోరాటాన్నే నిర్వీర్యం చేసే పనిచేయొద్దు' అని మహేశ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.



## మీ ఆశీస్సులు ప్రభుత్వానికి కావాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రంజాన్ కేవలం పండుగ కాదని.. ఆత్మశుద్ధి చేసుకునే సమయమని పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినందుకు సంతోషంగా ఉందని చెప్పారు. ప్రజలంతా సోదరభావంతో మతసామరస్యంతో కలిసి మెలిసి ఉండాలని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ముస్లింలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. అజహారుద్దీన్‌కు క్యాబినెట్‌లో చోటు కల్పించామని గుర్తు చేశారు. సీనియర్ నేత షబీర్ అలీకి సలహాదారు పదవి ఇచ్చామన్నారు. మొత్తం 8 మంది మైనారిటీ నేతలకు కార్పొరేషన్ పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. 'క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చాం. బాక్సర్ నిక్కత్ జరీన్‌కు రూ. 2 కోట్ల రూపాయలు ఇచ్చి ప్రోత్సహించాము. ప్రభుత్వ ప్రతి కార్యక్రమంలో మైనార్టీ కు సింహ భాగం ఇస్తున్నాం. అంతా కలిసి మెలిసి దేశాన్ని ముందుకు తీసుకుపోవాలి. వైఎస్ హయాంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారు. రిజర్వేషన్ల వల్ల అనేక మందికి ఉద్యోగాలు వచ్చాయి. ఈ ప్రభుత్వం మీది నేను మీ సోదరుడిని' అంటూ రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'మీ ఆశీస్సులు ప్రభుత్వానికి కావాలి. మతాల మధ్య చిచ్చు పెట్టడానికి కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. మనం కలిసి మెలసి తెలంగాణను ముందుకు తీసుకెళ్లాలి. దేశంలో తెలంగాణను అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్దాం' అంటూ రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# మోగిన ఎన్నికల నగారా

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా ఎలక్టోరల్ అధికారులు, ఎస్పీలు, ఐజీలు, డీఐజీలతోనూ భేటీ జరిగింది. చీఫ్ ఎలక్టోరల్ అధికారులు, సీఎస్‌లు, డీజీపీలు, నోడల్ అధికారులతోనూ భేటీ జరిగింది. ఎస్ఐఆర్‌కు సంబంధించి బీఎల్‌వోలకు మౌలిక సదుపాయాలు కల్పించాం. పారదర్శక, నిష్పాక్షికంగా ఎన్నికల కోసమే ఎస్ఐఆర్ నిర్వహిస్తున్నాం. ఓటరు అవగాహన కార్యక్రమాల అధికారులు, యువ ఓటర్లతో మాట్లాడాం" అని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు.

**25 లక్షలమంది ఎన్నికల అధికారులు**

"ఐదు రాష్ట్రాల్లో మొత్తం 25 లక్షల మంది ఎన్నికల అధికారులు ఉన్నారు. 15 లక్షల మంది పోలింగ్ సిబ్బంది, 8.5 లక్షల మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. మొత్తం 2.18 లక్షల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. పోలింగ్, ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నాం. దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. దివ్యాంగులు, వృద్ధులు ఇంటి వద్ద నుంచి ఓటు వేసేందుకు దరఖాస్తు చేయాలి. అభ్యర్థుల ఫొటోలు ఈవీఎంలపై ప్రదర్శించాలని సూచించాం. పోలింగ్ ఏజెంట్ల బూత్‌లు వంద మీటర్ల తర్వాత ఏర్పాటు చేయాలి. ఓటరు సేవల కోసం ఈసీఐనెట్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేశాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వందశాతం వెబ్‌కాస్టింగ్ ఉంటుంది" అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు.

**తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్**

మొత్తం నియోజకవర్గాలు: 234
గెజిట్ నోటిఫికేషన్ విడుదల తేదీ: 30 మార్చి 2026 (సోమవారం)
నామినేషన్ల దాఖలు చివరి తేదీ: 06 ఏప్రిల్ 2026 (సోమవారం)
నామినేషన్ల పరిశీలన తేదీ: 07 ఏప్రిల్ 2026 (మంగళవారం)
నామినేషన్ల ఉపసంహరణ చివరి తేదీ: 09 ఏప్రిల్ 2026 (గురువారం)
పోలింగ్ తేదీ: 23 ఏప్రిల్ 2026 (గురువారం)
ఓట్ల లెక్కింపు తేదీ: 04 మే 2026 (సోమవారం)

**రెండు దశల్లో పశ్చిమ బెంగాల్**

పశ్చిమబెంగాల్ ఎన్నికల షెడ్యూల్
మొదటి దశ (152 అసెంబ్లీ నియోజకవర్గాలు)
పోలింగ్ తేదీ: 23 ఏప్రిల్ 2026 (గురువారం)
రెండో దశ (142 అసెంబ్లీ నియోజకవర్గాలు)
గెజిట్ నోటిఫికేషన్ విడుదల: 02 ఏప్రిల్ 2026 (గురువారం)
పోలింగ్ తేదీ: 29 ఏప్రిల్ 2026 (బుధవారం)
ఓట్ల లెక్కింపు: 04 మే 2026 (సోమవారం)

**అస్సాం. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్**


మొత్తం నియోజకవర్గాలు : 126
గెజిట్ నోటిఫికేషన్ విడుదల తేదీ: 16 మార్చి 2026 (సోమవారం)
నామినేషన్ల దాఖలు చివరి తేదీ: 23 మార్చి 2026 (సోమవారం)
నామినేషన్ల పరిశీలన తేదీ: 24 మార్చి 2026 (మంగళవారం)
నామినేషన్ల ఉపసంహరణ చివరి తేదీ: 26 మార్చి 2026 (గురువారం)
పోలింగ్ తేదీ: 09 ఏప్రిల్ 2026 (గురువారం)
ఓట్ల లెక్కింపు తేదీ: 04 మే 2026 (సోమవారం)

**నెలలోపే పూర్తికానున్న మూడు రాష్ట్రాల ఎన్నికలు**

నెల తిరక్కుండానే మూడు రాష్ట్రాల ఎన్నికలు పూర్తి కానున్నాయి. కేరళ, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీలకు సోమవారం నోటిఫికేషన్ రానుండగా, మార్చి 23తో నామినేషన్ల ప్రక్రియ పూర్తికానుంది. ఏప్రిల్ 9 పోలింగ్ జరగనుంది. అంటే మూడు చిన్న రాష్ట్రాలకు నెల లోపే ఎన్నికల ప్రక్రియ పూర్తికానుంది. ఇక తమిళనాడు అసెంబ్లీ ఎన్నిక ఏప్రిల్ 23న జరగనుండగా ఒక్క విడతలోనే పూర్తి కానుంది. పశ్చిమబెంగాల్ అసెంబ్లీకి రెండు విడతల్లో ఎన్నిక జరగనుంది. ఏప్రిల్ 23, 29తేదీల్లో ఎన్నిక జరగనుంది. గతంలో ఏడువిడతల్లో ఎన్నిక జరగ్గా, ఈసారి రెండు విడతల్లో సింపుల్ గా షెడ్యూల్ పెట్టారు. ఈసారి సర్ ప్రక్షాళనతో రెండు విడతల్లో ఎన్నిక పూర్తిచేయవచ్చని అధికారయంత్రాంగం నిర్ణయించింది.

**8 అసెంబ్లీ నియోజకవర్గాలకు బైపోల్స్**

ఆరు రాష్ట్రాల్లో 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు జరగనున్నాయి. గోవా, గుజరాత్, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో ఒక్క నియోజకవర్గం చొప్పున ఉపఎన్నిక జరగనుంది. కర్ణాటక, మహారాష్ట్రలో రెండు నియోజకవర్గాల చొప్పున ఉపఎన్నికలు జరుగుతాయి. కర్ణాటక(2), గోవా(1), నాగాలాండ్(1), త్రిపుర(1)లో ఏప్రిల్ 9న ఎన్నికల పోలింగ్ జరగనుంది. మహారాష్ట్ర(2), గుజరాత్(1)లో ఏప్రిల్ 23న ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. మే 4న ఉపఎన్నికల ఫలితాలు వెలువడతాయి.




# దద్దరిల్లుతున్న పశ్చిమాసియా

(మొదటిపేజీ తరువాయి)


ఇరాన్ కూడా ఏమాత్రం తగ్గకుండా ప్రతీకారదాడులు కొనసాగించింది. అమెరికా, ఇజ్రాయెల్ సైనిక సదుపాయాలే లక్ష్యంగా క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది.

**ఇరాన్ లో 153 ఆరోగ్యకేంద్రాలు ధ్వంసం**

ఇక, ప్రస్తుతం దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతూనే ఉంది. ఇరాన్ తాజాగా గల్ఫ్‌లోని అమెరికా బేస్‌లు, ఇజ్రాయెల్‌పై దాడులు చేసింది. ఇజ్రాయెల్, అమెరికా కలిసి సంయుక్త దాడుల కొనసాగించగా, ఇస్ఫహాన్ నగరం పేలుళ్లతో మార్మోగిపోయింది. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతున్న నేపథ్యంలో 14 పశ్చిమాసియా దేశాలను ఖాళీ చేయాలని అమెరికన్లను ట్రంప్ సర్కార్ ఆదేశించింది. కాగా ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో డజన్ల కొద్దీ ప్రజలు మృతి చెందినట్లు తెలుస్తోంది. సైనిక, పారిశ్రామిక ప్రాంతాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులపైనా అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేసినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఫార్స్ రాష్ట్ర రాజధాని షిరాజ్‌లో ప్రజలు నివసించే ప్రాంతంలో అమెరికాఇజ్రాయెల్ దాడులు చేసినట్లు తస్నీమ్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. ఇరాన్ వ్యాప్తంగా 153 ఆరోగ్య కేంద్రాలు ధ్వంసమైనట్లు పేర్కొంది. పశ్చిమ ఇరాన్‌లో ఆదివారం భారీ ఎత్తున దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది.

**హర్ముజ్ తెరిచే ఉంది**

ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకంగా భావించే హర్మూజ్ జలసంధి విషయంలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యూహాత్మక సముద్ర మార్గాన్ని అమెరికా



మరియు ఇజ్రాయెల్‌కు చెందిన నౌకలకు మాత్రమే మూసివేశామని ఆయన తెలిపారు. అయితే ఇతర దేశాల నౌకలకు హర్మూజ్ జలసంధి మార్గం పూర్తిగా తెరిచే ఉందని స్పష్టం చేశారు.

**దుబాయ్, కువైట్ ఎయిర్ పోర్టులపై ఇరాన్ డ్రోన్ల దాడి**

అమెరికా, ఇజ్రాయెల్ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం రోజురోజుకు ముదురుతుంది. ఈ దేశాల మధ్య ఘర్షణ కారణంగా గల్ఫ్ ప్రాంతాలు విలవిల్లాడుతున్నాయి. అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ పశ్చిమాసియా దేశాలపై డ్రోన్లతో దాడులు చేస్తోంది. ఇప్పటికే యూఏఈ, బహ్రెయిన్ వంటి పలు దేశాలపై ఇరాన్ దాడులు చేసింది. ఈ క్రమంలో తాజాగా కువైట్, దుబాయ్ విమానాశ్రాయలపై కూడా ఇరాన్ దాడులు చేయడంతో ఆ ప్రాంతం దద్దరిల్లింది.

**ఇరాన్ సుప్రీం ఆరోగ్యపరిస్థితి విషమమే**

ఇరాన్ నూతన సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఆరోగ్య పరిస్థితిపై నెలకొన్న ఉత్కంఠకు భారత నిఘా వర్గాల తాజా నివేదిక కొంత స్పష్టతనిచ్చింది. ఫిబ్రవరి 28న అమెరికాఇజ్రాయెల్ జరిపిన దాడిలో మొజ్తాబా ఖమేనీ తీవ్రంగా గాయపడి కదలలేని స్థితిలో ఉన్నట్లు జాతీయ మీడియా కథనాలు భారత నిఘా వర్గాలను ఉటంకిస్తూ పేర్కొన్నాయి. తన తండ్రి అలీ ఖమేనీ మరణించిన అదే దాడిలో మొజ్తాబా కూడా తీవ్రంగా గాయపడ్డారని తెలిపాయి. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని, దీనివల్ల బయటి ప్రపంచంతో నేరుగా సంబంధాలు పెట్టుకోలేకపోతున్నారని వివరించాయి. మొజ్తాబా ఖమేనీ పేరుతో వస్తున్న సందేశాలన్నింటినీ ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ పర్యవేక్షిస్తోంది.

## నెతన్యాహు ఎక్కడున్నా చంపేస్తాం

**ఇరాన్ డెత్ వార్నింగ్**

**మహా:** ఇరాన్, ఇజ్రాయెల్అమెరికా కూటమి మధ్య జరుగుతున్న యుద్ధం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. తమ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణానికి ప్రతీకారంగా ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహును 'వేటాడి చంపుతామని' ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్ జీసీ) శనివారం ప్రతిజ్ఞ చేశాయి. నెతన్యాహు ఆచూకీపై సామాజిక మాధ్యమాల్లో పుకార్లు వస్తున్న తరుణంలో ఆయన ఎక్కడ ఉన్నా వదిలిపెట్టబోమని ఇరాన్ సైన్యం హెచ్చరించింది. "అతను బతికే ఉంటే.. అతన్ని వెంబడిస్తాం, పట్టుకుంటాం, చంపేస్తాం" అంటూ టెలిగ్రామ్ ఛానల్ వేదికగా ఐఆర్ జీసీ సంచలన ప్రకటన చేసింది.

**16 రోజుల యుద్ధంలో..**

యుద్ధం 16వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో బాగ్దాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయంపై మరోసారి క్షిపణి దాడి జరిగింది. ఎంబసీ ఆవరణలోని హెలిప్యాడ్‌పై మిస్సైల్ పడటంతో పెద్ద ఎత్తున పొగలు వ్యాపించాయి. ఇరాన్ సైన్యం వెనక్కి తగ్గడం లేదు. ఇప్పటికే ఇజ్రాయెల్‌పై ఐదు సార్లు బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మాట్లాడుతూ.. తమ దేశ చమురు క్షేత్రాలపై దాడి జరిగితే పశ్చిమాసియాలో అమెరికా వాటాలున్న ప్రతి చమురు కేంద్రాన్ని బూడిద చేస్తామని హెచ్చరించారు. ఈ యుద్ధ ప్రభావంతో బహ్రెయిన్, సౌదీ అరేబియాలో జరగాల్సిన ఫార్ములా 1 రేసింగ్‌లు కూడా రద్దయ్యాయి. ఇరు పక్షాల మధ్య దాడులు, ప్రతిదాడులు తీవ్రం కావడంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం ఏర్పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

## డ్రగ్ టెస్ట్‌లో ఏలూరు ఎంపీకి పాజిటివ్



(మొదటిపేజీ తరువాయి)

ఈ సమయంలో పైలట్ రోహిత్ రెడ్డి, టీడీపీ ఎంపీ మహేశ్ కుమార్ సహా పలువురిని అదుపులోకి తీసుకున్నారు. శనివారం రాత్రి పోలీసుల రాకను గమనించిన పార్టీలో ఉన్న యువకులు వారిని అడ్డుకుని నానా హంగామా సృష్టించారు. ఈ సమయంలో 2 గ్రాముల కొకైన్‌తో పాటు ఒక తుపాకీ పట్టుబడింది. అయితే, ఢిల్లీకి చెందిన నమిత్ శర్మ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి గాలిలో ఒక రౌండ్ కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. నమిత్ శర్మ కాల్పుల జరిపిన గన్ లైసెన్స్ రోహిత్ రెడ్డి సోదరుడు రితీష్ రెడ్డి పేరు మీద ఉందని చెప్పారు. ఘటనపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇందులో ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్, పైలట్ రోహిత్ రెడ్డి, నమిత్ శర్మ, రోహిత్ రెడ్డి సోదరుడు రితేష్ రెడ్డి సహా పది మంది పేర్లు ఉన్నాయి. పట్టుబడిన వారికి తమ వద్ద ఉన్న డ్రగ్ టెస్టు కిట్ ద్వారా పోలీసులు పరీక్ష నిర్వహించగా.. అర్జున్ రెడ్డి, కౌషిక్ రవి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మ, పైలట్ రోహిత్ రెడ్డిలకు పాజిటివ్ వచ్చింది. అయితే, ర్యాపిడ్ టెస్ట్ టీడీపీ ఎంపీకి నెగిటివ్ వచ్చింది. కానీ, ఆదివారం ఉదయం రక్త నమూనాలను పరీక్షించగా టీడీపీ ఎంపీ కూడా డ్రగ్స్ వాడినట్లు నిర్ధారణ అయ్యింది. ఫామ్ హౌస్ వద్ద రెండు లగ్జరీ కార్లను స్వాధీనం చేసుకున్నారు.

**విపక్షాల ఫైర్**

తక్షణమే ఎంపీని పార్టీ తొలగించాలని కాంగ్రెస్, సీపీఎం, వైసీపీ శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి. చట్టాన్ని గౌరవించే పార్టీ అని చెప్పుకునే టీడీపీ, ఇప్పుడు తన ఎంపీ డ్రగ్స్ కేసులో దొరికితే ఎందుకు మౌనంగా ఉందని కాంగ్రెస్, సీపీఎం నేతలు ప్రశ్నిస్తున్నారు. విలువలతో కూడిన రాజకీయం చేయాలంటే మహేష్ యాదవ్‌ను పార్టీ నుంచి బహిష్కరించాలని స్పష్టం చేశారు.

**పార్లమెంట్ జరుగుతుంటే.. కొకైన్ తో విందుచిందా? - కాంగ్రెస్ చీఫ్ షర్మిల ఫైర్**

మొయినాబాద్ డ్రగ్స్ పార్టీలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ దొరకడం సిగ్గుచేటు. ఢిల్లీలో పార్లమెంట్ జరుగుతుంటే ఈ ఎంపీ ఇక్కడ కొకైన్‌తో విందు చిందు చేస్తున్నాడు. ఎంపీ పదవి నుంచి పుట్టా మహేష్ ను వెంటనే తొలగించాలి.. పార్టీ నుంచి వెంటనే సస్పెన్షన్ విధించాలని ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

## ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌పై వెంటనే నివేదిక ఇవ్వండి

- **ఎవరినీ ఉపేక్షించేది లేదు**
- **టీడీపీ స్టేట్ చీఫ్ పల్లాను ఆదేశించిన చంద్రబాబు**

**విజయవాడ, మహా :** మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ వ్యవహారంపై ఏపీ సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేశ్‌పై ఆరోపణలను చంద్రబాబు సీరియస్‌గా తీసుకున్నారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఎంపీ మహేష్‌ను పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. ఆరోపణలకు సంబంధించి వివరణ కోరుతూ పుట్టా మహేశ్‌కు నోటీసులు ఇవ్వాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను చంద్రబాబు ఆదేశించారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ డ్రగ్స్ కేసులో పట్టుబడిన అంశంపై నివేదిక ఇవ్వాలని పల్లా



శ్రీనివాస్‌ను సీఎం చంద్రబాబు ఆదేశించారు. డ్రగ్స్ వంటి ఘటనల్లో ఎవరు ఉన్నా ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వ్యక్తులు, నేతలు చేసే తప్పులకు పార్టీ నష్టపోయే పరిస్థితి రానివ్వనని సీఎం చంద్రబాబు తేల్చి చెప్పారు.

## కాంగ్రెస్ సవాల్ స్వీకరిస్తున్నా...

- **సంబంధం లేని విషయాల్లో నా పేరు ప్రస్తావిస్తే సహించం**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్, మహా:** సమాజంలో మాదకద్రవ్యాల వాడకం పెరగడం అత్యంత దురదృష్టకరమని, దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. డ్రగ్స్ వాడకాన్ని బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ఖండిస్తుందని, ఈ విషయంలో రాజకీయాలకు అతీతంగా ఎవరైనా సరే కఠిన శిక్షలు అనుభవించాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. తాను ఏ విధమైన పరీక్షకైనా, ఏ సమయమైనా సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా కేటీఆర్ పునరుద్ఘాటించారు. ఇదిలా ఉంటే.. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతి చిన్న విషయంలోనూ తన పేరును డ్రగ్స్ వివాదాల్లోకి లాగడంపై కేటీఆర్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. "ప్రతీసారి ఆధారాలు లేకుండా నా పేరును ప్రస్తావిస్తే ఇకపై ఉపే



క్షించేది లేదు.. చట్టపరంగా కఠినంగా స్పందిస్తా" అని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే పలుమార్లు తాను పరీక్షలకు సిద్ధమని చెప్పినప్పటికీ, కావాలనే బురదజల్లే రాజకీయాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికైనా తమ మద్దతు ఉంటుందని, కానీ వ్యక్తిత్వ హననానికి పాల్పడితే మాత్రం సహించబోమని కేటీఆర్ తేల్చి చెప్పారు.

## రైతు భరోసా డేట్ వచ్చేసింది

**22 నుండి ఖాతాల్లోకి నిధులు**
**అన్నదాతలకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త**

**హైదరాబాద్, మహా:** అన్నదాతలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ నెల 22న రైతు భరోసా మొదటి విడత నిధులు విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. సిద్దిపేట జిల్లా నర్మెట్ట నుంచి రైతు భరోసా నిధులు సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేయనున్నారు. తొలి విడతగా 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి ఒక ఎకరం వరకు నిధులు విడుదల చేస్తారు. ఒక ఎకరం వరకు రైతు భరోసా కింద రూ.3,590 కోట్ల నిధులు విడుదల చేయనున్నారు. రెండో విడతగా మరో 20 రోజుల తర్వాత రూ.2,650 కోట్ల నిధులు, మొత్తం మూడు విడతల్లో రైతుల ఖాతాల్లోకి రూ.9 వేల కోట్లు విడుదల చేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరులోపు మూడో విడతగా మొత్తం రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. రైతు భరోసా నిధుల విడుదలపై ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో రేవంత్ రెడ్డి చర్చించారు.

**రైతులకు పీఎం కిసాన్ నిధులు విడుదల**

దేశవ్యాప్తంగా అర్హులైన 9.3 కోట్లకు పైగా రైతులకు పీఎం కిసాన్ పథకం కింద 22వ విడత నిధులను ఇటీవల విడుదల చేశారు పీఎం నరేంద్ర మోదీ. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన ద్వారా పంట సాయం కింద అర్హులైన లబ్ధిదారులకు కేంద్రం నిధులు విడుదల చేసింది. 5 ఎకరాల్లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు సంవత్సరానికి రూ.6,000 చొప్పున మూడు విడతల్లో పెట్టుబడి సాయం అందజేస్తోంది. తాజాగా వచ్చే ఖరీఫ్ కోసం తొలి విడత విడుదల చేయగా రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి.

## మిస్టర్ రంగనాథ్

(మొదటిపేజీ తరువాయి)

అయితే 10 అక్టోబర్ 2025 హైదరాబాద్ హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్థానిక తహశీల్దార్ లేఖ రాస్తూ ఈ నిర్మాణాల వల్ల మూసీకి వరదకు కారణం అయిందని రాశారు. ఈ ప్రాజెక్టు వల్ల అందులోని నివాసం ఉండబోయే వారికి ఆ చుట్టుపక్కల వారి ప్రాణాలకు ముప్పు ఉందని చెప్పి ఇప్పుడు మళ్లీ సిగ్గు లేకుండా వీడియోలు తీసి పెడుతారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరేమైనా గ్రాఫిక్ డిజైనర్లా? కంటెంట్ క్రియేటర్లా? నిజం మాట్లాడితే ఇష్టం వచ్చినట్లు ఎదురుదాడి చేయడం తమాషా అయిపోయిందంటూ ఆగ్రహం ప్రదర్శించారు.

**హైడ్రాకు డెడ్ లైన్**

నేను చేసిన ఆందోళన నేపథ్యంలో హైడ్రా చేసిన ట్వీట్లను వెంటనే డిలీట్ చేయాలని, సోమవారం ఉదయం పరువు నష్టం దావా వేస్తానని కవిత హెచ్చరించారు. చూద్దాం ఎక్కడి వరకైనా వెళ్దామన్నారు. పేదవారి ఇళ్లను కూల్చివేస్తున్న మీరు వీటిని ఎందుకు వదిలేస్తున్నారని మండిపడ్డారు. ఈ రాష్ట్రంలో ప్రభుత్వం, ప్రతిపక్షాలు ఇలాగే తయారయ్యాయన్నారు. మీకు మాత్రమే కాదు మాకు లాయర్లు ఉంటారన్నారు.

# నిరుద్యోగ యువతకు ఐక్యత భరోసా

### నిరుద్యోగ యువతతో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖాముఖి



**ఆమనగల్లు, మహా :** వెల్దండ మండలం చౌదర్పల్లి గ్రామంలో ఆదివారం నిరుద్యోగ యువతతో ముఖాముఖి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కార్యక్రమం నిర్వహించారు... ఈ సందర్భంగా యువతకు ఉద్యోగ అవకాశాలపై దిశానిర్దేశం చేశారు.. యువత ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని,ప్రస్తుత కాలంలో ఉన్న వివిధ ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యాల అభివృద్ధి, శిక్షణా కార్యక్రమాల ప్రాముఖ్యత గురించి వివరించారు,.కృషి, పట్టుదలతో ప్రయత్నిస్తే మంచి ఉద్యోగాన్ని సాధించి కుటుంబ భవిష్యత్తును ఆర్థికంగా బలోపేతం చేసుకోవచ్చని యువతకు ప్రేరణ ఇచ్చారు..యువత కేవలం ప్రభుత్వ ఉద్యోగాలు కోసమే ఎదురుచూడకుండా, ప్రవేట్ రంగంలో కూడా ఉన్న అవకాశాలను కూడా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.గ్రామంలోని నిరుద్యోగ యువతకు మార్గదర్శకత్వం అందిస్తూ,వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడానికి,వారి అభివృద్ధికి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని భరోసానిచ్చారు.. ఈ కార్యక్రమంలో.. గ్రామ యువతతో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసి సేవలను సద్వినియోగం చేసుకోవాలి :ఎమ్మెల్యే



**ఆమనగల్లు, మహా :** కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదివారం పిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ తో కలిసి పంపిణీ చేశారు. పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎంఆర్ఎఫ్ ఆపద్బాంధవుడిలా తోడ్పడుతుందని ఆయనపేర్కొన్నారు. అనారోగ్యం బారిన పడిన పేదలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల ప్రజాప్రతినిధులు ,నాయకులు పాల్గొన్నారు.

# ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి






### జిల్లా అదనపు కలెక్టర్ కె. శ్రీనివాస్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**జనాభా లెక్కలు 2027 ప్రక్రియలో భాగంగా మొదటి దశ చేపట్టవలసిన ఇండ్ల గణన కార్యక్రమాన్ని సబంధించిన శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ కె. శ్రీనివాస్ ప్రారంభించారు. ఆదివారం జిల్లా సమీకృత కార్యాలయంలో చార్జ్ అధికారులు (తహసీల్దార్ & మున్సిపల్ కమినర్లు), అదనపు చార్జి అధికారులకు (mpdo's & managers) లకు నిర్వహిస్తున్న (03) రోజుల శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జన గణన, ఇండ్ల గణన కార్యక్రమంలో భాగంగా 2026 సంవత్సరంలో మొదటి విడతలో ఇండ్ల గణన కార్యక్రమాన్ని పూర్తి డిజిటలైజేషన్ పద్ధతిలో చేపట్టడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి సమాచారాన్ని సేకరించి వివరాలు నమోదుచేసి ఇండ్ల జాబితా రూపొందిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు గణన ప్రక్రియ ను నిర్వహిస్తారని, తమ యొక్క మండల పరిధికి చార్జ్ అధికారులుగా తహసిల్దార్లు, అదనపు చార్జ్ అధికారులుగా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు వ్యవహరిస్తారని అదేవిధంగా తమ యొక్క మున్సిపల్ పరిధికి చార్గ్ అధికారులుగా సంబంధిత మున్సిపల్ కమిషనర్ మరియు అదనపు ఛార్జ్ అధికారులుగా మేనేజర్లు వ్యవహరిస్తారని తెలిపారు సెన్సెస్ ఇండెక్స్ పుస్తకాన్ని పూర్తిగా చదివి అవగాహన పెంపొందించుకోవాలని, మాస్టర్ ట్రైనర్లు వివరించే ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఇండ్ల గణన కార్యక్రమాన్ని నిర్వహించి కార్యచరణ ప్రకారం జాబితా రూపొందించాలని తెలిపారు. 15, 16, 17 రోజులలో నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని,ప్రతి అంశాన్ని నేర్చుకుంటూ ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, సిపిఓ సౌమ్య, జెడ్పి సీఈవో కృష్ణారెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, ఆర్డీవోలు తాసిల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మాస్టర్ ట్రైనర్స్ తదితరులు పాల్గొన్నారు.



## బహుజన యోధుడు కాన్షీ రాంకు ఘన నివాళి

**ఆమనగల్లు, మహా :** సామాజిక, రాజకీయ సమానత్వానికి పునాది వేసినగొప్ప నాయకుడు కాన్షీరాం అని ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ జిల్లా నాయకుడు రమేష్ కొనియాడారు. ఆదివారం ఆమనగల్లులో కాన్షీరాం జయంతి వేడుకలను ఘనంగానిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ రాజకీయాల్లో ఆయన సృష్టించిన ప్రకంపనలు చిరస్మరణీయమన్నారు. ఈకార్యక్రమంలో ఆమనగల్లు మండల నాయకులు ప్రవీణ్,జె.యాదగిరి, వి. శేఖర్,జె.సురేష్,కడ్తాల్ మండల మండల అధ్యక్షులు హరిదేవ్ మాడుగుల మండల అధ్యక్షులు పోలే శివ, శ్రీను, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి ప్రత్యేక దృష్టి



**ఆమనగల్లు, మహా :** కడ్తాల్ మండలం సరికొండ గ్రామంలో గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ గ్రామ సర్పంచ్ అద్దాల మహేందర్, ఉప సర్పంచ్ సామ బలవంత్ రెడ్డి వార్డు సభ్యులతో కలిసి భూమి పూజ చేశారు..ఈ సందర్భంగా సర్పంచ్ అద్దాల మహేందర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో చాలా కాలంగా ఉన్న రహదారి సమస్యలను పరిష్కరించేందుకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు.గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం గ్రామపంచాయతీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత గ్రామ ప్రజలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు కూడా తగ్గుతాయని ఆయన అన్నారు..గ్రామంలో రహదారులు,పారిశుద్ధ్యం,తాగునీటి వంటి సమస్యల పరిష్కారానికి గ్రామపంచాయతీ ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు.



## పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు...

### రక్షణ కిట్ల పంపిణీ..

**మణుగూరు, మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఆదివారం సమితి సింగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించి రక్షణ కిట్లను పంపిణీ చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య సేవలు అందిస్తున్న కార్మికుల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గ్రామపంచాయతీ పాలకవర్గ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది పారిశుద్ధ్య కార్మికులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. అనంతరం వారికి గ్లౌజులు, మాస్కులు, ఇతర భద్రతా సామగ్రి కలిగిన రక్షణ కిట్లను అందజేశారు.కార్యక్రమంలో సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, వార్డు సభ్యులు మాదాడి రాజేష్, కోలపిన్ని మానస, ఉకే కృష్ణవేణి, బిరుదురాజుల శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఏఎన్ఎం పుష్పలత, ఆశా వర్కర్ శిరోమణి, పంచాయతీ సిబ్బంది రామన్న, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

### సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలన

మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని అంబేద్కర్ సెంటర్ నుంచి జూనియర్ కాలేజీ వరకు, అలాగే అంబేద్కర్ సెంటర్ నుంచి టెలిఫోన్ ఎక్స్చేంజ్ వరకు ఉన్న సెంట్రల్ లైటింగ్ మరమ్మత్తు పనులను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ పనులను సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ లు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో రాత్రి సమయంలో ప్రజలకు సౌకర్యంగా ఉండేలా సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను సరిచేసే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.కార్యక్రమంలో వార్డు సభ్యులు కోలపిన్ని మానస, ఉకే కృష్ణవేణి, మాదాడి రాజేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మన్యవర్ కాన్షిరాం జయంతి



**మంచిర్యాల, మహా :** బహుజన సమాజ్ పార్టీ నేత స్వర్గీయ మాన్యవార్ కాన్సిరాం 92 వ జయంతి వేడుకలు మంచిర్యాల జిల్లా ఐ.బీ అంబేద్కర్ చౌరస్త వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ములకల రాజేంద్ర ప్రసాద్, రాష్ట్ర నాయకులు కాదాసి రవీందర్, జిల్లా ఇంచార్జి లు దాగం శ్రీనివాస్ లు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల ఐక్యత కొరకు కాన్సిరాం కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పర్యటించారని చెప్పారు. బహుజనులకు రాజ్యాధికారం రావాలని మరణించే వరకు పోరాటం చేసిన గొప్ప వీరుడు కాన్సీరామని కొనియాడారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో నేతలు నాగుల కిరణ్ బాబు, బోయిన్ పల్లి సంతోష్ కుమార్, సెట్టి ప్రవలిక, కుమ్మరి కృష్ణ చైతన్య, కన్నం రవి,గోలేటి నారాయణ, సుగుర్తపల్లి అశోక్, షఫీ,గజ్జి వినయ్, నాగుల అనిల్, బాంసేఫ్, సెట్టి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## వేం నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెల్పిన సుంకిరెడ్డి



**ఆమనగల్లు, మహా :** తెలంగాణ రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో వేం నరేందర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యులుగా ఎన్నిక కావడం తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని అన్నారు. పార్లమెంట్ లో ఆయన తెలంగాణ ప్రజల సమస్యలను బలంగా వినిపిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తారని ఆకాంక్షించారు. అదేవిధంగా కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు, నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం తదితర అంశాలపై ఆయనతో చర్చించినట్లు సుంకిరెడ్డి పేర్కొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా మహా:** శనివారం రోజున ఆరుట్ల గ్రామంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం జరిగింది. మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వార్డు మెంబెర్ ఇమ్రాన్ ఖాన్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండీ యూసుబ్ అలీ సలామ్ సార్, మాజీ సర్పంచ్ ఆనం గళ్ల యాదయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడ్డిమల్ల చంద్రయ్య,అంతటి రాజు గౌడ్, మాధగోని జంగయ్య గౌడ్, పంబాల శివకుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బుడిగల పరమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు రావుల నాగరాజ్, కొల్లోజు విశ్వనాథ్ చారి, మైనారిటీ నాయకులు గాల్బేబ్, జహంగిర్, ఎండి హమీద్, ఎండి రఫిక్, సర్వర్, ఖలీల్, సలీమ్ మరియు తదితర ముస్లిం సోదరులు భారీ ఎత్తున పాల్గొనడం జరిగింది.

## సర్వాయి గుంపు వలస ఆదివాసీలకు బెడ్ షీట్స్ పంపిణీ

### ముఖ్య అతిథిగా అతిధిగా కూనవరం సర్పంచ్ ఏనిక శ్వేత..



**మణుగూరు, మహా :**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా పర్చేజ్ డిపార్ట్మెంట్ అధికారి కె సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో కూనవరం గ్రామపంచాయతీ పరిధిలోని సర్వాయి గుంపుకు చెందిన వలస ఆదివాసి కుటుంబాలకు ఆదివారం బెడ్ షీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కూనవరం సర్పంచ్ ఏనిక శ్వేత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏనిక శ్వేత మాట్లాడుతూ వేసవి కాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చిన్నారులు, వృద్ధులు ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గ్రామ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. అలాగే గత అనుభవాల దృష్ట్యా రేగులగండి చెరువులో ఈతకు వెళ్లవద్దని, జాలరులు, చేపలు పట్టేవారు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమం నిర్వహించిన సింగరేణి అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చిన్నారులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి సింగరేణి సేవా సమితి సభ్యులు యస్.డి నాసర్ పాషా సమన్వయకర్తగా వ్యవహరించగా.. ఇష్టు నాయకులు ఏ మంగీలాల్, గ్రామ పెద్దలు చుక్కయ్య, దేవి తదితరులు పాల్గొన్నారు.




## సూచిక బోర్డుల ఏర్పాటు!

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు మండలం ఆకుతోట పల్లి పంచాయతీ గౌరారం గేట్ వద్ద పలు గ్రామాలకు వెళ్లే దారులను సూచించే నేమ్ బోర్డులను సర్పంచ్ నరేందర్రెడ్డి ఆదివారం ఏర్పాటు చేయించారు. సూచిక బోర్డులు లేక వాహనదారులు, కొత్తవారు దారితెలియక ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్నిగుర్తించి ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. దారి చూపే బోర్డులు ఏర్పాటు చేయడంపై గ్రామస్థులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మున్సిపల్ కార్మికులకు పరిశుభ్రత కిట్ల పంపిణీ




**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మున్సిపాలిటీలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో మణుగూరు మున్సిపల్ కార్మికులకు పరిశుభ్రత కిట్ లను పంపిణీ చేశారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ కిట్ లను మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ వర్కర్లకు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీకి చెందిన 66 మంది మున్సిపల్ కార్మికులకు ఒక సంవత్సరానికి అవసరమైన పరిశుభ్రత వస్తువులను పంపిణీ చేశారు. ప్రతి కార్మికునికి 12 సంతూర్ సబ్బులు, 12 రిన్ సబ్బులు, 12 కొబ్బరి నూనె సీసాలు, అర్ధ కిలో బెల్లం చొప్పున ఒక్కో కార్మికునికి అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ పట్టణ పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పరిశుభ్రతలో కార్మికుల పాత్ర కీలకమని తెలిపారు. కార్యక్రమంలో టీపీఓ శ్యామ్ తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మణుగూరు ప్రముఖ వ్యాపారి దండా రాధాకృష్ణ ఆర్థిక సహకారం అందించారు.

# శివాని ఎడ్యుకేషనల్ పాఠశాల పేరుతో మోసం

### ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కార్యకలాపాలు






**మందమర్రి, మహా :**మందమర్రి మండల కేంద్రంలో శివాని ఎడ్యుకేషనల్ పాఠశాల పేరుతో మోసం ఆ యాజమాన్యం మోసం చేస్తుందని విద్యార్థి జన సమితి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బచ్చలి ప్రవీణ్ కుమార్ ఆరవించారు. ఆదివారం మందమర్రిలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శివాని ఎడ్యుకేషనల్ ఇనిస్ట్యూట్ పేరుతో నడుస్తున్న విద్యాసంస్థ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ సంస్థకు ప్రభుత్వం నుండి ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే “శివాని శ్రీ రామ్ స్కూల్” పేరుతో కొత్తగా విద్యాసంస్థ ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆయన ఆరోపించారు. ఈ సంస్థ నర్సరీ, ప్రైమరీ, సెకండరీ, హై స్కూల్, అలాగే యూజీ, పీజీ వరకు విద్య అందిస్తున్నట్లు పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి “ప్రవేశాలు ఓపెన్” చేసినట్లు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ విద్యార్థులను ఆకర్షించే ప్రయత్నం చేస్తోందని అన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులకు వివిధ రకాల హామీలు ఇస్తూ ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్నారని ఆరోపించారు. అదేవిధంగా ఐఐటి, నీట్ ఫౌండేషన్, నవోదయ కోచింగ్, డిజిటల్ క్లాస్‌రూమ్స్, ఏసి క్యాంపస్, స్ట్రెస్ ఫ్రీ లెర్నింగ్ వంటి ఆధునిక సదుపాయాలు ఉన్నట్లు ప్రచారం చేస్తున్నప్పటికీ సంబంధిత శాఖ పెడచెవిన పెడుతుందని పేర్కొన్నారు. వాస్తవానికి ప్రభుత్వ విద్యా నిబంధనలకు అనుగుణంగా అవసరమైన కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేవని తెలిపారు. అధికారులు ఈ విషయాన్ని చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం విద్యాశాఖ నుండి ఎలాంటి షిఫ్టింగ్ అనుమతులు లేకుండానే, భవనం నిర్మాణం పూర్తిగా పూర్తికాకముందే పాఠశాల ప్రారంభించేందుకు యాజమాన్యం ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వము జారీ చేసిన జి.ఓ.ఎం.ఎస్. నెం.1 ప్రకారం పాఠశాలలు నిర్వహించేందుకు తప్పనిసరిగా ఉండవలసిన కనీస మౌలిక వసతులు అయిన సురక్షిత భవనం, విశాలమైన ప్లే గ్రౌండ్, ఫైర్ సేఫ్టీ, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్య వసతులు, సరిపడిన తరగతి గదులు వంటి అనేక నిబంధనలు పాటించాల్సి ఉంటుందని తెలిపారు. అయితే ఈ సంస్థలో ఆ నిబంధనలు పూర్తిగా పాటించబడలేదని ఆరోపించారు.అదేవిధంగా విద్యాశాఖ, మున్సిపల్, ఫైర్ ఇతర సంబంధిత విభాగాల నుండి ఎలాంటి అనుమతులు పొందకుండానే ఒకే క్యాంపస్‌లో స్కూల్‌తో పాటు జూనియర్ కాలేజ్, డిగ్రీ కాలేజ్ నిర్వహించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పోస్టర్లు ప్రకటనల ద్వారా టీచింగ్ ,నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించుకునేందుకు ప్రయత్నాలు చేయడం, ముందస్తు అడ్మిషన్లు చేపట్టడం వంటి చర్యలు పూర్తిగా ప్రభుత్వ విద్యా నిబంధనలకు విరుద్ధమని అన్నారు. ఇలాంటి అనుమతులు లేని విద్యాసంస్థలు నిర్వహించడం వలన విద్యార్థుల భద్రతకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని, తల్లిదండ్రులు మోసపోయే పరిస్థితులు తలెత్తవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు ఈ విద్యాసంస్థ పై సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అన్ని అవసరమైన అనుమతులు పొందే వరకు ఎలాంటి విద్యా కార్యకలాపాలు నిర్వహించకుండా వెంటనే ఆ విద్యాసంస్థను సీజ్ చేసి యాజమాన్యం పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## మున్సిపల్ కార్మికులకు హెల్త్ క్యాంప్..




**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో మణుగూరు మున్సిపాలిటీలో ఆదివారం మున్సిపల్ కార్మికుల కోసం ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరంలో మున్సిపల్ వర్కర్లకు షుగర్, బీపీ, రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది కార్మికులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అలాగే పనిలో ఒత్తిడి లేకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. అదేవిధంగా పగిడేరు, రామానుజవరం గ్రామపంచాయతీలలో కూడా ఆరోగ్య శిబిరాలను నిర్వహించి, ఆయా పంచాయతీల పారిశుద్ధ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంప్రసాద్, రామలక్ష్మి, ఇందిరా, రమణ, శ్యామ్, విజయ్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అహ్మద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ..

### పంపిణీ చేసిన బీజాన్ బీ కుటుంబ సభ్యులు అక్బర్ , జానీ పాషా..



**తల్లాడ, మహా :**తల్లాడకు చెందిన షేక్. అహ్మద్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులకు ఆదివారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. అహ్మద్ సతీమణి బీజాన్ బీ గారి కుటుంబ సభ్యులు షేక్. అక్బర్ జానీపాషా గార్ల చేతులమీదుగా ముస్లింలకు తోఫా అందించారు. తల్లాడ, నారాయణపురం, మల్లవరం, కొడవటిమెట్ట( రెడ్డిగూడెం), ఎన్టీఆర్ నగర్, వెంకటాపురం తదితర గ్రామాల్లో ఈ తోఫాను అందించారు. ఈ సందర్భంగా అక్బర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది అహ్మద్ జ్ఞాపకార్థం ఖమ్మంలో నివాసం ఉంటున్న ప్రముఖ వ్యాపారవేత్త షేక్. ఖదీర్ పాషా ఆధ్వర్యంలో తల్లాడ మండల ముస్లింలందరికి తోఫా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. స్వగ్రామానికి సేవ చేయాలనే దృక్పథంతో తండ్రి,జ్ఞాపకార్థం అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. పండుగను ప్రతి ఒక్కరు సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు షేక్ అక్బర్, మస్తాన్, షేక్. ఈసూఫ్, ఎండి బహదూర్, అన్వర్ పాషా, షరిబుద్దిన్, షేక్ మేహరాజ్, కమల్ పాషా, మౌలాలి, నాగులుమీరా, షేక్. ముస్తఫా, చిన్నా సైదా తదితరులు పాల్గొన్నారు.

మహా పత్రిక
ANN తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 16-03-2026


# డార్క్ రియాలిటీ అను ఐదో పాదం

జీవిత పరమార్థం అంటే సంతోషమేనంటూ
అనుభవించు రాజాల వ్యాపార సామ్రాజ్య కూడలిలో
నీవు ,నేను ,మనమంతా
కూలీల గానే!
లీలా వినోదంగానే!!
భూమ్మీద ఒక నరకోత్సవం నిర్మించబడింది.
చీకటి రసాల చెరసాల ఒకటి తయారు చేయబడిం
ది.
అత్యాధునిక రాక్షసయుగంలో
మానవత్వం భస్మమైపోయింది.
ఐదో పాదమేదో ..
హింసాతల, జుగుప్సాకర
విశృంఖల పైశాచికత్వాన్ని రచిస్తుంది.
ప్రపంచమెక కామకేళీ విన్యాస క్షేత్రమైపోయింది!
సమస్త పవిత్ర గ్రంధాలు తగలబడుతున్నాయి.
దేవుడు ఆ మంటల్లో ఆత్మహత్య చేసుకుంటున్నాడు.
భూగోళం చెదలు పట్టిన గ్రంథాలయమైపోయింది.
టెక్నాలజీలెన్ని నూతన ఆవిష్కరణల అవతారమెత్తి
నా
మానవ స్వభావం ప్రాచీన కాలంలోనే సనాతన చరి
త్రను మోస్తున్నది.
రోదనామయ జీవితాన్ని పోషిస్తున్నది.
రాళ్లన్నీ దేవుళ్ళు కాబడ్డాక
మనుషులు పిశాచులు కాక మరేమవుతారు ?!
ఒక డ్రాక్యులా అవతారమేదో
మాస్క్ లైఫ్ లో
కార్పొరేట్ కల్చర్ రాక్షసత్వ కైపులో
ధనాంధకార విలాసమై
అధికారాహంకార కామ గానమై
రాతి హృదయాల్లో మ్రోగుతుంది.
లోహ ఉదయాలేవో నిదుర లేస్తాయి.
అనైతికంగా,అధర్మంగా,
అసాంఘికంగా..
వైల్డెస్ట్ పార్టీస్ ప్రపంచాన్ని శాసిస్తూ
Jeffrey Epstein Files
దే వర్ ఈట్ హ్యూమన్ మీట్
పిజ్జాలు, గ్రేప్ సోడాలు,
చీజ్ లు, ఐస్ క్రీములు,
వాల్ నట్ లు కోడ్ కాంటాక్ట్స్ ల
రహస్య అంగాల రాసాధిక కామ కేళీ విన్యాస
విలాసాల స్వర్గంలాంటి నరక సృష్టికర్తల మేళా
ఒకటి ప్రపంచానికి
అత్యాధునికంగా నిర్మించబడింది.
న్యాయం, ధర్మం రాజ్యాధిపతుల
బూట్ల కింద నలిగిపోతుంది.
పసిప్రాయదేహంగాలు
మద మగ మృగాల వాంఛకు
బలైపోయాయి.
సాక్ష్యాలు నగ్నంగా విశ్వవీధుల్లో
ఊరేగుతున్నా
ఏ గుడిలోని రాతి విగ్రహాలు మాట్లాడవు.
డబ్బే దైవం, స్వార్థమే సత్యం.
మనది నపుంసక స్వప్నం.
బురద పాముల బుస.
సముద్రపు అలల కింద
ఎడినో క్రోమ్ కలల నరమేధ సామ్రాజ్యాలు.
లిస్టులుంటాయి
సాక్ష్యాధారాలుంటాయి.
కేసులుండవ్
అరెస్టులు అసలే సాధ్యం కావు.
కరెన్సీ కట్టల సంరక్షణలో
సామ్రాజ్యాధినేతల, పారిశ్రామికవేత్తల రాచ క్రీడలు.
ప్రజల విషాదాన్ని అందంగా అల్లుకుంటూ
ఆనందించే
శృంగార లోక సృష్టికర్తల
అరాచక ఏలికల పైశాచిక పీడనలో
ఎంత నెత్తురు పారెనో
ఇంత పచ్చని నేలలో.
ఎన్ని బతుకులు కూలెనో
ఇన్ని హత్యల వినోదపు క్రీడలో.
ఎడారికి నీడ ఉండదు.
సముద్రానికి నిద్ర పట్టదు.

సామాన్య జనానికి సౌఖ్యముండదు.
ఈ విశ్వమొక పిశాచాల నగరం.
పీఠాధిపతుల డార్క్ డెన్.
నా ముందు అద్దంలో ఎవరో పరాయి వాడు.
వ్యాపారంలో అద్దం కూడా మోసాన్నే ప్రేమిస్తున్నది.
అంతా పరాయికరణ.
ఏ దృశ్యమూ స్పష్టంగా లేదు.
కాలం మసకబారుతున్నది.
రాక్షసోత్సవం వర్ధిల్లుతున్నది.
బానిసత్వాన్ని మోసుకుంటూ
ఐదో పాదం.
సమాధానం లేని ప్రశ్నలను
తలకెత్తుకుంటూ సామ్రాజ్యవాదం.

ఇది దేశద్రోహుల యుగం.
దెయ్యాల ఉద్యానవనం
నవ యవ్వన శృంగార సామ్రాజ్యం.
ఆధిపత్యాహంకార వర్గం పన్నిన
ఉచ్చులు.
సనాతన ధర్మాలు పేనిన
ఉరితాడులు.
తరతరాలుగా యుగయుగాలుగా
కొనసాగుతూనే..
తినడానికి తిండి దొరకని
దేశాల మధ్య
సామ్రాజ్యవాద పెత్తందారీ యుద్ధాలు వాడికిష్టం.
నరనరాన అల్లుకుపోయిన చక్రవర్తుల
కామోత్సవాలు.
కుబుసం విప్పిన పెద్ద మనుషుల
విషపు కోరల విష సామ్రాజ్యాలు.
రహస్య పేజీల చీకటి రాత్రులే
పీడ కలల పీడకుల పైశాచిక వలలు.
ఇదొక అత్యాధునిక నాగరికత
ఇక్కడ చరిత్ర పేజీలో
డోనాల్డ్ ట్రంపులుంటారు.
అనేకానేక కంపుగాళ్ళుంటారు.
బిల్ గేట్స్ లుంటారు.
ఎలాన్ మస్కలుంటారు.
రోనాల్డ్ రీగన్లు ఉంటారు.
మైకేల్ జాక్సన్లుంటారు.
మోడీలుంటారు.
కేడీలుంటారు.
వేలాదిమంది రాజకీయ నేతలు
పారిశ్రామికవేత్తలు
ఆధ్యాత్మిక వాదులు
శాస్త్రవేత్తలు, సెలబ్రిటీలు, లెజెండరీలు
పెద్ద మనుషులు
ముసుగు దొంగలు
దెయ్యపు పాదాల
నరమాంస భక్షకుల
పైశాచిక వేదాలు.
A.I. పసిగట్టని రహస్యాలు.
అలెక్సాలు చేయని అరాచకాలు
ఇదే విశ్వ మానవ ప్రగతి !
ఆధునికానంతర విజ్ఞాన సమాజపు పెనునీతి!
ప్రశ్నల్లేని, సమాధానమవలేని
వైరల్ దృశ్యాల నపుంసక సామ్రాజ్యపు కోతి.
రేపటి తరాల రాజీతత్వం.
మిగిలిపోయేదెన్నటికీ బానిసత్వం.
పైశాచిక భక్తితత్వం.
నేనిప్పుడు మనుషుల్లేని ప్రపంచాన్ని కలగంటున్న
వినోద సామ్రాజ్యపు పైశాచిక విలాసాల్ని చూసి
సిగ్గుపడుతున్నాను.
నేనిప్పుడు మనిషిగా
రక్తపిశాచుల సామ్రాజ్యపు
ఐదో పాదపు డార్క్ రియాలిటీలో చిక్కి
మరణిస్తున్నాను.
మరణాన్ని ప్రేమిస్తున్న జాతిని
ప్రశ్నిస్తున్నాను.
ప్రతిఘటనా స్వరమై
ప్రపంచ పైశాచిక వాదాన్ని
తెగ నరకడానికి అభ్యుదయ ధారగా మళ్లీ పుడుతు
న్నాను.
చోద్యం చూస్తున్న ,
నిత్యం మరణాన్ని మోస్తున్న
సామాన్య ప్రజలారా
చైతన్య శిబిరాలై కదలి రండి.
అణచివేతలు లేని,
అంతరాలెరుగని,
వివక్షలు తెలియని
రేపటి ప్రపంచాన్ని నిర్మిద్దాం.
ప్రపంచ మానవులారా
ఏకంకండి.
సామూహిక చైతన్యమే
ప్రేమ, కరుణల
సమతా మమతల
శాంతి సూత్రం.

**శిఖా - ఆకాష్**
**9381522247**


## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
haneefsd777@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.


# ఆత్మగౌరవ నినాదమైన కవిత్వం



- డాక్టర్ కొత్వాలు అమరేంద్ర,
సెల్ : 9177732414

తన హక్కుల్ని కాలరాసే సామాజిక అసమానతల నుంచి, కొండంతగా పెరిగిపోతున్న వివక్షల నుంచి తనను తాను విముక్తుడు కావడానికి మనిషి అనాదిగా తపిస్తూనే వున్నాడు. ఆత్మగౌరవంతో పోరాటం చేస్తూనే వున్నాడు. అయినా అంతకంతకూ తనను చుట్టుముట్టే సామాజిక రుగ్మతలు తనకు తీరని అస్తిత్వవేదనను మిగులుస్తూనేవున్నాయి. ఆత్మగౌరవచైతన్యం అతనిని నిరంతరం తట్టిలేపుతూనే వుంది. అందుకే కవిత్వం ఆ అసమానతల్ని, ఆ వివక్షల్నీ కూకటివేళ్లతో పెకళించ డానికి ఒక ఆయుధమైపోయింది. బహుజనుల ఆత్మగౌరవతోటల్లోకి చొరబడిన కులాధిపత్యపు శిశిరాలను కూలరాయడానికి తన అక్షరాల నిండా చైతన్యప్రవాహాన్ని నింపుతూనే వుంది. బిగుసుకున్న పిడికిలి అయిపోయింది. వెన్నెలంత ఆత్మగౌరవం కోసం అది తపిస్తూనేవుంది.

ఆత్మగౌరవపోరాటం ప్రధాన అజెండాగా...
ఇప్పుడు తెలుగులో శక్తివంతంగా వెలుడుతున్న బహుజనకవిత్వంలో ఆత్మగౌరవపోరాటం ప్రధాన అజెండా అయింది. తెలుగులో ఎనభైయ్యవ దశకంలో ప్రారభమైన అస్తిత్వ కవిత్వధోరణుల్లో అస్తిత్వ అన్వేషణలో భాగంగా ఆత్మగౌరవమే ప్రధాన భూమికగా కనిపిస్తుంది. ప్రపంచ చరిత్రలో నల్లజాతిమీద తెల్లవారి వివక్ష ఒక చెరిగిపోని మరకగా మిగిలిపోయింది. అగ్రదేశాల్లో వేళ్లూనుకున్న ఆ వివక్ష నేటికీ ఆ జాతిని బాధిస్తూనేవుంది. నల్లజాతిమీది వివక్షను కవిత్వం అప్పటినుంచే తీవ్రంగా నిరసిస్తూవుంది. 'సింహాలు తన చరిత్రను చెప్పుకోనన్ని రోజులు వేటగాడు చెప్పేదే చరిత్ర అవుతుంది' అంటూ ఆఫ్రికన్ రచయిత చినువా అచెబి పీడిత వర్గాలు తమ చరిత్రను ధైర్యంగా చెప్పుకోకపోతే చరిత్రే తారుమారు అవుతుందని, అందుకు ఆత్మగౌరవం ఎంతో అవసరమంటాడు. అమెరికన్ రచయిత్రి మాయా ఏంజెలో 'నువ్వు చరిత్రలో నన్ను రాసుకోవచ్చు/నీ చేదు, వక్రీకృత అబద్ధాలతో/నువ్వు నన్ను మట్టిలో అణచవచ్చు/కానీ ఇప్పటికీ దుమ్ముగా నేను లేస్తాను' అంటూ పీడిత వర్గాల్లో పొడసూపే ఆత్మగౌరవ చైతన్యాన్ని కవిత్వీకరిస్తూ నల్లజాతి చరిత్ర పార్శ్వాలను ప్రపంచానికి అందించింది. ఆఫ్రికన్ కవి జాక్ రౌమైన్ 'ఆఫ్రికాలోనైనా, అమెరికాలోనైనా మాకిక సాధ్యంకాదు/నీ నీగ్రోలుగా వుండడం/మీ నిగర్లుగా వుండడం/మీ హీనమైన నిగ్గర్లుగా బ్రతుకులీడ్చడం/మాకేమాత్రమూ సాధ్యంకాదు' అంటూ అసమానతకు వ్యతిరేకంగా నల్లజాతిప్రజల్లో పెల్లుబికే ఆత్మగౌరవచైతన్యానికి అక్షరరూపమిస్తాడు. 'ఆత్మగౌరవమ్ము అఖిల సంపదలంచు/ గొప్పదనుచు బుధులు చెప్పిరయ్య/కుదువ బెట్టవద్దు పదవి కోసము దాని/అవధరింపుమయ్య ఆర్షపుత్ర' అంటూ మనిషి తనకు అత్యంత ముఖ్యమైన ఆత్మగౌరవాన్ని ఎలా నిలబెట్టుకోవాలో శతకకారుడు వేమన్న ఆనాడే తన నీతిపద్యంలో ఉద్బోధ చేశాడు. 'ఆత్మగౌరవం సంపాదించబడుతుంది/కష్టపడిపనిచేస్తే దానిని ధృవీకరంచవచ్చు/ నిర్మించడానికి సంవత్సరాలు పడుతుంది/కొన్నిసార్లు అది అపరాధభావనగా మారుతుంది/ఆత్మగౌరవం ఒక రత్నం/ మనమందరం ఆదరించాలి'(ఆత్మగౌరవం) అంటూ వర్తమాన రచయిత్రి వాణి యాదవ్ మనిషి తన ఆత్మగౌరవాన్ని ఎలా కాపాడుకోవాలో చెబుతుంది. 'అది అమ్ముడుపోని ఆత్మగౌరవం/అమలు కాని రాజ్యాంగం/మూగమనుషుల కంచుకంఠం/భజనకి బందీకాని భవిష్యత్ కావ్యం'(ఆత్మగౌరవ బొమ్మ) అంటూ కేశవకుమార్ ఆత్మగౌరవం ఎలాంటిదో వర్ణిస్తాడు. 'నా కవితావధూటి వదనంబునెగాదిగా చూచి రూపరే/ఖాకమనీయవైఖరుల గాంచి 'భళీభళీ' యన్నవాడే/మీదేగులమన్న ప్రశ్న వెలయించి, చివుక్కున లేచిపోవులో/బాకు గ్రుమ్మినట్లగును పార్థివ చంద్ర! వంచింప సిగ్గగున్' అంటూ తన మానసిక సంఘర్షణను వినిపించిన కవికులతిలకుడు గుర్రం జాషువా 'నల్లతాచు వలె వర్ణబేధము నాల్కల్ సాచు కాలంబునన్/వలచెన్ నన్ను కవితావాణి' అంటూ తన కవిత్వమంతా ఆత్మగౌరవ చైతన్యంతోనే వెలువరించాడు. మరో కవివరేణ్యుడు శ్రీరంగం నారాయణబాబు ఆనాడే తన 'గడ్డపరక' ఖండికలో 'పల్లకీ దిగనట్టి వెళ్లికొడుకులు మీరు/పట్టుతివాసీని నేను/నడవండి నడవండి/నామీంచి నడవండి' అంటూ బూర్జువా వ్యవస్థ దోపిడీవైనాన్ని గడ్డపర కలాంటి శ్రామిక వ్యవస్థ చేత ధ్వనింపజేస్తూనే 'పశ్చిమానిలము పాడిన పాట/కాకాసురుని కథ జ్ఞాపకం తెచ్చింది/నన్నునే తెలుసుకున్నాను/ఆగండి ఆగండి' అంటూ ఆ శ్రామికవర్గం చేతనే కాకాసురుని కథను జ్ఞాపకం చేయిస్తూ ఆ వర్గంలోని ఆత్మగౌరవచైతన్యాన్ని ధ్వనింపజేశాడు.

సంఘర్షణ నుంచే ఆత్మగౌరవచైతన్యం
మనిషికీ మనిషికీ మధ్య అసమానతల నేపథ్యంలో చోటుచేసుకునే నిరంతర సంఘర్షణలోంచే ఆత్మగౌరవ పోరాటం ప్రారంభమైంది. తెలుగు సాహిత్యంలో ఎనభైయ్యవ దశకంనుంచే అస్తిత్వ ఉద్యమాలు ప్రారంభమై ఆత్మగౌరవ పోరాటాలు చోటుచేసుకు న్నాయి. ఇప్పటి బహుజన కవిత్వంలో భాగాలైపోయిన స్త్రీవాద, దళితవాద, మైనారిటీ వాద కవిత్వధోరణుల్లో ఆత్మగౌరవచైతన్యం వెల్లివిరిసింది. వెల్లివిరుస్తోంది. నీలిమేఘాలు(తొలి స్త్రీవాద కవితాసంపుటి), చిక్కనవుతున్న పాట,బహువచనం, సమూహం, బీసీ కవితాసంకలనం తదితర సంపుటాలు, కులవృత్తి కారుల ఆత్మగౌరవ పోరాట నేపథ్యంలో వెలువడిన అసిపె(వనపట్ల సుబ్బయ్య), బువ్వకుండ(అన్నవరం దేవేందర్), పోగుబంధం(మోహనకృష్ణ) మగ్గం బతుకు(రాధేయ), కల్లంచు బువ్వ(ఈ. రాఘవేంద్ర), కుంపటి(బాణా శ్రీనివాసరావు) వంటి అనేక దీర్ఘకవితలు ఆత్మగౌరవ చైతన్యానికి పాదులు వేశాయి. వేస్తున్నాయి.

ఆత్మగౌరవాన్ని తట్టిలేపిన స్త్రీవాద కవిత్వం
పురుషాహంకార ఆధిపత్య ధోరణికి వ్యతిరేకంగా సాహిత్యంలో ఉద్భవించిన స్త్రీవాద కవిత్వం మహిళల్లో ఆత్మగౌరవాన్ని తట్టిలేపింది. ఆత్మగౌరవచైతన్యం దిశగా వారిని ఆలోచింపజేసింది. 'నేనెప్పుడూ అగ్నితో ఆడుకోలేదు/చిన్నప్పుడు చలిపొయ్యి దగ్గర కూర్చునేదాన్ని/అప్పుడు మాట వేరు/కానీ నేను ఈ అగ్నిబీజాన్ని జాగ్రత్తగా దాచుకున్నాను/ఎప్పుడు అవసరం పడుతుందో/అధర్మాన్ని దహించడానికి/ లోపలో బయటో వున్న దానవుడిని దగ్ధం చేయడానికి/ అప్పుడప్పుడూ అగ్నిశిఖలా మారి/నాట్యం చేయానిపిస్తుంది'(అగ్నిబీజం) అంటూ అస్సాం కవయిత్రి అంజలి జీవితంలో ఎదురయ్యే కష్టాలను ఎదుర్కోవడానికి ఆత్మగౌరవచైతన్యాన్ని అగ్నితో పోల్చుకుంటుంది. గృహహింస నుంచి మహిళలకు విముక్తి కలిగించడంలో భాగంగా 'నడుములు విరిగే చాకిరీలో నలిగి/గుక్కపట్టిన పిల్లల ఎడుపుల మధ్య బందీలైన స్త్రీలు/మెరుపుల పిడికిళ్ళెత్తిన పోరాటప్రచండ ఘోషను తెగబడిన ధర్మాన్ని/ఓ నా మిగిలిన మగప్రపంచమా!/నీవిప్పుడు చూడక తప్పదు'(తెగబడిన కలలప్రపంచం) అంటూ స్త్రీవాద కవయిత్రి విమల తమ ఆత్మగౌరవచైతన్యంతో మహిళలు తమ కలల ప్రపంచాన్ని సాకారం చేసుకోవాలని ఆకాంక్షిస్తుంది. ఇక్కడ మెరుపుల పిడికిళ్ళు ఆత్మగౌరవానికి ప్రతీకలయ్యాయి.

బహుజనచైతన్యానికి ఊతమిస్తూ...
తెలుగులో మొదట దళిత కవిత్వంగా ఆవిర్భవించిన బహుజనకవిత్వం ఆత్మగౌరవచైతన్యానికి పెద్దపీట వేసింది. 'శంభూకుడు పెదాల మీద చిరునవ్వుతో రాముణ్ణి వధిస్తున్నాడు/ఏకలవ్యుడు ద్రోణుని బొటనవేలును గొడ్డలితో నరుకుతున్నాడు/బలి తన చిరుపాదాలతో వామనుణ్ణి...'(నడుస్తున్న చరిత్ర) అంటూ విప్లవకవి శివసాగర్ పురాణప్రతీకలను సామాజిక రుగ్మతలకు అన్వయిస్తూ బహుజనుల నడుస్తున్న చరిత్ర ఎలా వుండాలో,వారిలో ఆత్మగౌరవచైతన్యం ఎలా పెల్లుబకాలో సూచిస్తాడు. 'నేను జనసమూహాల గాయాన్ని గాయాల సమూహాన్ని/తరతరాలుగా స్వతంత్రదేశంలో అస్వతంత్రుణ్ణి/అవమానాలకూ, అత్యాచారాలకూ, మానభంగాలకూ, చిత్రహింసలకూ గురై/పిడికెడు ఆత్మగౌరవ కోసం తలెత్తినవాణ్ణి/ ధనమదాంధకులోన్మత్తుల రాజ్యంలో/బతకడమే ఒక నిరసనగా బతుకుతున్నవాణ్ణి'(పిడికెడు ఆత్మగౌరవం కోసం) అంటూ కలేకూరి ప్రసాద్ రగిలే గుండెకొలిమిలోంచి దళితుల వేదనను వినిపిస్తూనే ఆత్మగౌరవచైతన్యంతో అతడు తన బ్రతుకును పోరాటం చేసుకున్న వైనాన్ని వర్ణిస్తాడు. 'నా వాకిట్లో కల్లాపి నన్నే చల్లుకోనివ్వండి/నా రోడ్డుమీద కంకర నన్నే పోసుకోనివ్వండి/నా కన్నీళ్లపాళీతో నా చరిత్రను నన్నే రాసుకోనివ్వండి' అంటూ వరదయ్య దళితుడు తన ఆత్మగౌరవంతో తన హక్కుల్ని ప్రకటించుకోవడాన్ని వర్ణిస్తాడు. 'ఈ సమీకరణలేమిటి ఈ సమూహాలేమిటి/ఈ సంబంధాలేమిటి ఈ రణన్నినాదాలేమిటి/జఠరాగ్ని, బడబాగ్ని తోబుట్టువులేనని/అసంతృప్తుల్ని పోగేస్తే అల్పపీడనమవుతుందని/ వాయుగుండమై వామనపాదమై/కొత్త నింగీనేలా పుట్టుకొస్తాయని నూరిపోసి/వీళ్లిలా విరుచుకుపడే విద్య నేర్పిందెవరసలు'(అల్పపీడనం) అంటూ పైడి తేరేష్ బాబు అల్పపీడనం, వాయుగుండం పదప్రయోగాలతో ఆత్మగౌరవంతో వెల్లివిరిసే చైతన్యపరిణామాన్ని ధ్వనింపజేస్తాడు. అల్పపీడనం ఆత్మగౌరవానికి సంకేతంగా కనిపిస్తుంది. 'నేను బద్ధలవుతున్న అగ్నిపర్వతాన్ని/నన్నెవరూ ఆర్పలేరు/నాది అగ్నిపాదాలు/నా కళ్లను ఏ తాళ్లు కట్టిపడెయ్యలేవు/ నాశిరస్సు సగర్వపతాక/నన్నెవరూ అవనతం చేయలేరు'(పాదముద్రలు) అంటూ చైతన్యంతో రగిలిపోతున్న దళితుడిలోని ఆత్మగౌరవాన్ని అగ్నిపర్వతంతో పోలుస్తాడు ఎండ్లూరి సుధాకర్. దానిని సగర్వంగా తలెత్తుకొని రెపరెపలాడే పతాకంగా కీర్తిస్తాడు. ఏ సామాజిక శృంఖలాలూ కట్టిపడెయ్యలేని కళ్లు కావాలంటాడు. 'మరలమరల నిన్ను ముసురుకుంటున్న సామూహిక దుఃఖమేదో మెల్కొలిపి/నిన్నో జెండాగా మార్చి ఎగరేస్తుంది'(సాంగ్ ఆఫ్ ది రివర్) అంటూ దగాపడిన బాధితుడిలో ఆత్మగౌరవం చైతన్యంగా ఎలా మారుతుందో ఆ పరిణామక్రమాన్ని వివరిస్తాడు కె.క్యూబ్ వర్మ. 'మేము అడవని కాస్తున్న కాపరులం/ తల్లిని నమ్మి బతికాం... నమ్మి బతుకుతాం/మా తావుల పోటీ మేమే తిరగవడితిమి/ఎవల తెరువుకు ఎందుకు బోతము/తెగబడి తగవుకు వత్తే/ తరిమితరిమి కొడతాం/యుద్ధం మేమెరిగిన విద్యకదా'(యుద్ధం) అంటూ వర్తమాన ఆదివాసీ కవయిత్రి కుంజ కళ్యాణి అడవి బిడ్డల తరపున వకాల్తా పుచ్చుకుంటూ వారి అమాయకత్వపు జీవనపార్శ్వాల్లోని పోరాటపటిమనూ కవిత్వీకరిస్తుంది. సామాజికపరిస్థితులు సృష్టించే అసమానతల్లో కొట్టుమిట్టాడే మనిషి ఆత్మగౌరవంతో ఎంతగా పోరాడతాడో ఆ పోరాటాన్ని బిల్ల మహేందర్ కవిత్వం చేస్తాడిలా... 'బతుకంతా అసమానత శిలువను మోస్తున్నాను /అడుగడుగునా అవమానపు చూపును భరిస్తున్నాను... పిడికెడు ఆత్మగౌరవాన్ని నిలబెట్టు కోవాలని/ఏతీరం వెంబడి పయనించినా/ గాయాలు అలలు అలలుగా తాకుతూనే వున్నాయి/ నాదేశం ఏ కులంగానో మతంగానో విడిపోయిన ప్రతిసారీ/నేను మరణిస్తూనే వున్నాను...ఇక్కడ మళ్లీ మళ్లీ మరణించడం మనిషి దుఃఖాన్ని సూచిస్తుంది. 'చలినెదుర్కోవడానికి మంట కావాలి/రగిలే వేడి కావాలి/ఆ మంట కోసమే/మనిషిలో రగిలే నిప్పుకోసమే ఈ తపన/ఈ పాట/ఈ కవిత్వం' (చల్లని చలి వెల్తురు) అంటూ ఆశారాజు మనిషిలోని ఆత్మగౌరవాన్ని రగిలే నిప్పుతో పోలుస్తూ చలి అనే దోపిడీ వ్యవస్థ వికృత చేష్టల్ని ఎదుర్కోవడానికి తప్పనిసరిగా నిప్పు అనే ఆత్మగౌరవచైతన్యం మంటలా ఎగిసిపోవాలని పేర్కొంటాడు.

కులవృత్తి కవిత్వంలో...
తెలుగులో ప్రస్తుతం ఒక ట్రెండుగా కొనసాగుతున్న కులవృత్తి కవిత్వంలో ఆత్మగౌరవపోరాటాలు పలువిధాలుగా చోటుచేసుకుంటున్నాయి. ఆవి దీర్ఘ కవితలుగా ఆవిర్భవిస్తున్నాయి. వస్తువిస్తృతి సౌలభ్యం దృష్ట్యా అవి కులవత్తుల్లోని అనేక పార్శ్వాలను అవిష్కరిస్తున్నాయి. 'నేను గొర్రెల్నికాస్తుంటాను/ గొర్రెల్ని గుర్తుపట్టి శాల్తీలను లెక్కలేసుకోవడం నా గణితశాస్త్రం/పుష్టిగా మేపి నీళ్లు తాపడం/నొప్పిరోగం గమనించి చికిత్స చేయడం/ అసమానతలు తొలగించి/సురక్షిత మార్గాన జీవాన్ని నడిపించడం/ నా పరిసర విజ్ఞానం/విశ్వరహస్యాలు తెలిసినవాన్ని/ వెర్రివాన్ని ఎలాగవుతానో' అంటూ ఒక గొర్రెల కాపరి తన ఆత్మగౌరవంతో తనకు తెలిసిన విజ్ఞానంతో తనను తాను సంభాళించుకోవడాన్ని కవిత్వం చేస్తాడు బెల్లి యాదయ్య. 'కుంపటి మాకు జీవితం/జీవించటానికి వెలుగు/కష్టాలు చుట్టుముట్టినప్పుడు/మాకు కన్నీళ్లకు చెమ్మగిల్లే చెక్కిళ్లను తుడిచే వేడి వేళ్లు/మా గుండెధైర్యం అది జీవనవేదం/మమ్మల్ని పలికించే తంత్రినాదం/మా బడుగువర్గాల పర్యాయపదం'(కుంపటి) అంటూ బాణాల శ్రీనివాసరావు వృత్తికారుడు ఆత్మగౌరవంతో తన వృత్తి పట్ల చూపే నిబద్ధతను అక్షరీకరిస్తాడు. 'అసిపెనే మా యింటికి బువ్వ/బతుకుబండి/మాజాతి జీవగర్ర వెన్నుగర్ర / ఆత్మగౌరవపతాక / కులవృత్తి కూరాడు'(అసిపె) అంటూ వనపట్ల సుబ్బయ్య అసిపె(మంగలిపెట్టె) మంగలివృత్తిలో ఎంత ప్రాదాన్యతను సంతరించుకుంటుందో వివరిస్తూ దానినే తమ ఆత్మగౌరవపతాకంగా అభివర్ణిస్తాడు. 'మా గీత పనిముట్లన్నీ/అటకెక్కిన పాత గోతాము మూటలో చేర్చాం/ వాటితోపాటు మా ఆత్మల్ని కూడా మూటగట్టాం... వృత్తి ప్రతి ఒక్కరి ఆర్థికమూలం/ ఆత్మసంతృప్తి ఆత్మగౌరవం సొంత అస్తిత్వం'(కల్లంచు బువ్వ) అంటూ ఈ. రాఘవేంద్ర ప్రపచీకరణ పడగనీడలో కల్లుగీత వృత్తి విధ్వంసక దృశ్యాలను కవిత్వీకరిస్తూ వృత్తి ఎంత ఆత్మసంతృప్తినీ, ఆత్మగౌరవాన్నీకలిగిస్తుందో పేర్కొంటాడు.
అసమానత రాజేసే మనిషి అస్తిత్వపుకొలిమిలో ఆత్మగౌరవం రగులుతూనే వుంటుంది. జీవితాన్ని శాసించే గొంతుల్ని ప్రశ్నించేందుకు అది నిప్పుకణమవుతూనేవుంటుంది. అందుకే మనిషిని నిరంతరం అప్రమత్తుడిని చేస్తూ అతడిలో చైతన్యకెరటాల్ని వుప్పొంగించే ఆత్మగౌరవం కవిత్వానికి ప్రియనేస్తమైపోయింది.


# మానవీయ మమతల ప్రతిబింబం నీడల దృశ్యం



-ఏనుగు నరసింహా రెడ్డి,
8978869183

శిల్పి చేతిలో ఉలి తాకిన శిల సజీవత్వాన్ని సంతరించు కుంటుంది. ఏయన్నార్ కలం సృజించిన పాదాలు కవితా కన్నియలుగా అలరారుతూ ఎత్తు పల్లాలపై నదీ ప్రవాహం తీరుగాపరవళ్ళతోనూ, గంభీరంగానూ కవిత్వపు నడక తగు మెయిగా సాగుతుంది. నరసింహారెడ్డి కవిత్వాన్ని చదివి ఓ పక్కన పెడితే అది చదివిన పాఠకుడిని ఓ పట్టాన నిలవనీయదు. కమ్ముకొనే ఆలోచనలతో వెంటాడే అనుభవాలను, అనుభూతులను, సంకటాలను, సంతోషాలను అన్నీ కలగలిపి మందానిల వీచికలతో మనకు సాంత్వనం కలిగిస్తూనే హృదయాన్ని ఆర్ద్రతతో తడిమి విడదీయరాని బంధంతో మరువలేని జ్ఞాపకాలతో సజీవ దృశ్యాలుగా మనతోనే ఉండే రీతిలో ఆవిష్కృతమవుతుంది.
అంతటి భావుకత కలిగిన కవిత్వాన్ని వెలువరించటానికి ప్రధాన కారణంనరసింహారెడ్డి మనిషి జీవితంలోని సాదక బాధకాలు స్వయంగా చవిచూసిన వాడు కావడం. పరిస్థితులను మానవీయ కోణంలో చూడగలిగిన పాడుకావడం.
పల్లె పట్టున పెరిగిన బాల్యం మట్టి పరిమళాలు, అనుభవాలు పెనవేసుకుపోయిన పల్లె వాతావరణం, మట్టిపలకపై అమ్మ దిద్దించిన అనురాగపు అక్షరాలు ఒక మూలమలుపులోనే ఆగకుండా జీవితం మలుపు తిప్పిన ప్రతీసారి మానవీయతలు తన కవిత్వంలో కోకొల్లలుగా దర్శనమిచ్చే మమకార మమేకాలు.
కుటుంబ గౌరవం పెంపు కోసం పిల్లల గెలుపోటములలో భుజం తడుతూ భావి జీవితానికి భారోసానిస్తూ వెన్నుముకగా నిలిచే నాన్న పసితనంలోనే దూరమైనా "నాయన పిట్టయి నా వెంట తిరుగుతున్నది" అంటూ నాన్న జ్ఞాపకాలు ఎప్పటికీ కంటి ముందు నీడల దృశ్యంలా కదలాడుతూనే వుంటాయిఅని సాధారణంగా చెప్పినా సార్వజనీనతను కలిగివుంటుందనేది నిజం.
కొడుకు దయనీయ స్థితిని చూసి తల్లి కల్లోల కడలిలా తల్లడిల్లినా ... కొడుకు ఉన్నతిని చూసి ఉప్పొంగినా ఏనుగు లక్ష్మమ్మ అసాధారణ కష్టజీవి. అవసాన దశలో అనారోగ్యం బారిన పడిన అమ్మ తన వలన కొడుక్కి కష్టం కలుగకూడదని వ్యాకుల వదనంతో తల్లడిల్లిన తల్లి దీనంగా పలికిన పలుకులనుఈయన కవిత్వం చేస్తాడిలా.

"ఊరికి దూరం కాటికి దగ్గర
నా వైద్యానికి అంత ఖర్చొద్దురా" అంటూ అమ్మ చల్లని ప్రేమమయ మనస్సును పాఠకుడి కన్నులు చెమరించి గుండె బరువేక్కేలా రాస్తాడు.
కీచులాటలు లేని ఆలుమగల దాంపత్యం మనం ఎరుగం. కానీ, అంతలోనే అన్నీ మరచి పోవడమే దాంపత్య బంధం.ఇంట్లో అన్ని పనులు చేసుకుంటూ ఇంటిల్లిపాదిని , భర్తను కంటికి రెప్పలా చూసుకునే భార్య ఆసుపత్రి మంచంపై
"వంట అసలే రానివాడివి
హోటల్లోనైనా సరిగ్గా తిను"
అన్నప్పుడు భార్యపడే బాధ, నిస్సహాయతను, చూసి భర్త లోలోపల పడుతున్న ఆవేదనా సందర్భం మన మనస్సును మెలిపెడుతుంది.
నాన్నతో బయటికి వెళ్ళడమంటే పిల్లలకి పట్టరాని సంతోషం. ఎంతగా అంటే గొప్ప సంతోషాల నైట్రస్ ఆక్సైడ్ బండిని కొండపై నుంచి కిందికి దొర్లించినట్లే పై నుండి కింది దాకా నిలువెల్లా సంతోషమే.
నాన్నతో ప్రదర్శనకు వెళ్ళి తన కిష్టమైన ఎన్నో బొమ్మలను చూసి గంతులేస్తూ కొనుక్కోవాలని ఉత్సుకతతో ఉన్న పిల్లకి తండ్రి జేబు గుర్తుకొచ్చి ఒక్కసారిగా గాలి తీసిన ట్యూబులా అయ్యి మనసు మార్చుకొని , కోరికలను చంపుకొని నాన్నతో మాట్లాడిన తీరు, తండ్రి పడే అవస్థను మరియు నిలువెత్తు ఎదిగి ఆర్ద్రమైన మనస్సుతో




మాట్లాడిన ఆ పిల్ల ఔన్నత్యం మనలను చలింపజేస్తుంది.

"నుమాయిష్ లో అందమైన
ఆట బొమ్మలను చూసి
గంతులేసిన చిన్న పిల్లకు మన జేబు గుర్తొచ్చి"
ఇప్పుడొద్దులే నాన్న" అని సర్దుకున్నప్పుడు..... దీర్ఘదర్శిలా ఎంతో ముందు చూపు కలిగిన పిల్లల్లా సంపూర్ణతతో నిలువెత్తున మనముందు నిలుస్తారు.
మనిషి ప్రాణం నిలువటానికి పట్టెడన్నం అవసరం. ఆ ఆహారాన్ని అందించటానికి తన రక్తాన్ని చెమటగా మార్చి రేయింబవళ్ళు కష్టపడి పండించిన పంటతో యావద్దేశ ప్రజల ఆకలి తీర్చే రైతన్న వెన్ను విరిచే నల్ల చట్టాలతో స్వచ్ఛమైన రైతు కన్నీటి చుక్కను కలుషితం చేసిన ప్రభువులపై తీవ్ర వ్యతిరేకతను ప్రదర్శిస్తూ ఆయుధాలు పట్టకుండా జరిపిన ఆందోళనలు , ఉద్యమాలు, పోరాటాలలో ఉప్పొంగిన రైతుల కన్నీరు జల్లులుగా కాక, జడివానలు ధారలుగా కురిపించి ప్రభుత్వం కళ్ళు తెరిపించిన ధీరోదాత్త రైతు రాకేశ్ తికాయతే. ఆయన నమ్ముకున్న మార్గం సత్యమార్గం. ... ఆలోచించినా, మాట్లాడినా ,ఆచరించినా సత్యాన్ని నమ్ముకొని సాగిన ఆ మహానియుడికి అక్షర వందనం సమర్పించడం మన సంస్కార ప్రదర్శనకు గీటురాయి.కన్నీరు

ఎంత తెల్లగా ఉంది
అమృతంతో శుద్ధి చేసి
నీ కళ్ళల్లో అమర్చాడా దేవుడు
సత్యం అలోచించి
సత్యమే వచించి
సత్యమే ఆచరించే
సగటు సగటున్నర రైతువి'

అందరి ఆకలి తీర్చే అన్నదాత అన్నమో రామచంద్రా !అని ఆక్రోశిస్తూ ఈ వ్యవస్థలో అగచాట్లు పడుతూనే ఉన్నాడు. మౌక్తికపు మనస్సుగల పొలమరి ఆవేదనాభరిత స్థితిని మలిచిన తీరులో ఆర్ద్రత, తెగింపు, మానవత్వాలు సత్య ఋజువులుగా ప్రతిబింబించి కవి యొక్క ఆవేదనలోని తీవ్రతకు అద్దం పడుతుంది.
ప్రాణ వాయువునిస్తూ ప్రాణం పోసే చెట్టు, ప్రకృతి సోయగాలతో ఓలలాడిస్తూ తల్లి ఒడిని మరిపిస్తుంది. పచ్చగా ఉండి మనిషికి ఊపిరి పోస్తూ జీవిస్తుంది.. ఎండిపోయినా మనిషి కట్టెను కాల్చేసి జన్మ పునీతం చేసుకుంటూ శాశ్వతంగా జీవిస్తుంది. మనిషి సౌఖ్యానికి సర్వం త్యాగం చేసిన చెట్టును కొడుకు, కూతుళ్ళతో సమన్వయ పరుచుకోవడం కవి గొప్ప భావుకతకు నిదర్శనం.

"ఎంత చెప్పిన వినని కొడుకలకన్నా
ఏదీ చెప్పకుండా అన్ని చేసే
బిడ్డలాంటివి చెట్లు
కొడుకులు వారసులైతే కావచ్చు గానీ
కూతుర్లు తండ్రుల అంతరంగ తరంగాలు ..."

అంటూ బిడ్డలపై మమకారాన్ని పచ్చని చెట్టు సహజ గుణాలతో అన్వయిస్తూ అందంగా , అనునయంగా చెప్పటం మమతానురాగాలకు ప్రతీకగా మనముందు నిలుస్తుంది.
ఈ కంప్యూటర్ యుగంలో మన నాగరికత రాకెట్ లా దూసుకుపోతున్నా, ప్రజలు తమకు తామే పరిపాలించుకునే రోజులైనా మనకు ప్రాతినిధ్యం వహించే పాలకులకు వత్తాసు పలకాల్సిందే. నేటి ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలకు స్థానం లేదు. మత మౌఢ్యం ముందు వివేచన పొసగదు. అందుకే మన నాగరికత మళ్ళీ వేదకాలం దాకా వెనక్కి వెళ్ళాల్సే ఉంటుందన్న విషయాన్ని స్పష్టంగా మేధావులముందుంచారు.

"ఇంకా మనం
ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం పరిహాసానికి
పులకరిస్తూనే ఉంటే
కాషాయం మత్తు శాలువలో
ముదురుకోవలసే ఉంటుంది
వేదాలు ఎంత దూరాన ఉన్నాయో
అంతదాకా వెనక్కి
నడవ వలసే ఉంటుంది "

ప్రజా నాయకులు ప్రజాస్వామ్యానికి ప్రాపుగా నిలవాలి గానీ మతం మత్తులో మునిగిపోకూ డదని, మన నిర్ణయాలు ముందడుగు వేసేలా ఉండాలి గానీ వెనక్కి లాగే పరిస్థితి ఉండకూడదని తెలుపుతూ ప్రతిమనిషిని ఆలోచింపజేస్తున్నారు.

'ఊయల ఎప్పుడూ
ఊగినట్లే ఉంటది
అంతరాంతరాల్లో
కప్పబడ్డ దుఃఖం
గుక్కపడుతూ ఉంటది' అనే వాక్యాలు సంతోషంగా కనపడే వారికి బాధలుండవని అనుకుంటే మరీచికపు మానసిక అంధత్వానికి తార్కాణమే అవుతుంది.
నేటి సమాజంలో కొందరు ధూర్తులు ఎంతో నమ్మకంగా, మంచిగా ఉంటూనే అదును చూసి నిలువునా ముంచే నయవంచకులు, ఆషాఢభూతులు మనతోనే ఉన్నారన్న నిజాన్ని తెలుపుతూ ... వైరి సైన్యాన్ని కట్టడి చేస్తూ అవలీలగా ఓడించే సత్తా ఉన్నా ఓటమిని చవి చూడాల్సిన దుస్థితి ఎదురైంది. దానికి కారణం నిజమైన శత్రువు నా శిబిరంలోనే, నాతోనే ఉన్నాడన్న వంచకుల నైజాన్ని మరిచానని తెలిసిరావడం.

'అయినా నేను
ఒక్క దెబ్బతోనే ఓడిపోయాను
కారణం
ఎదుటి శిభిరంలో కాక
శత్రువు నాతోనే ఉన్నాడన్న
సంగతి మరిచాను"
అనే పలుకులు సమాజంలోని స్వార్థ పోకడలకు అద్దం పడుతుంది.

కవుల గురించి, ఉదాత్త కవుల గురించి చెప్పుకోవల్సినప్పుడు కవి అనేవాడు ఒక విషయం మీద గాని, ఒక సందర్భంలో గాని జరిగిన విధానాన్ని లేదా విధ్వంసాన్ని మాత్రమే చెప్పటం కాదు. దానికి మూలమైన శక్తుల మూలలలాను కూడా ప్రజల ముందు నిలిపేలా ఉండాలనీఅటువంటి కవులు ఎందరో వున్నారని చెబుతూ

"కవులెం చేస్తారో చెప్పటమే కాదు
విధ్వంసపు అవసరాన్ని
చిత్రించడ మొక్కటే కాదు
పరస్పరం సంఘర్షించే
శక్తుల నేపథ్యాలను"

దండెం మీద ఆరేస్తాడుఅంతటి ఎందరో స్ఫూర్తిదాయక కవుల్లో కె. శివారెడ్డి గారు అగ్రభాగాన ఉంటారని గుర్తుచేస్తాడు.
ఏ స్థితిలోనూ మనిషి మాట, తీరులో మెరమెరలుండకూడదనే విషయాన్ని తెలిపే తీరును గమనిస్తే... తల్లిదండ్రులు దయనీయ పరిస్థితుల్లో ఉండికూడా పిల్లల పట్ల అమేయ అనురాగమే చూపిస్తారు. ఆకలితో మాడిన, అందలాన్నెక్కినా మాట తీరులో మార్పులు ఉండకూడదని రూడిపరుస్తాడు.

"కారడవిలో దిక్కు తోచని మాట
చిద్విలాసంగా సింహాసనం ఎక్కినప్పటి పలుకు
ఒక్క తీరుగానే వుండాలంటాను"

మనిషి మనిషిగా వుండే రీతి గాని, మాట తీరులో గాని మార్పు లేకుండా మాటకు కట్టుబడి వుండే విధంగా మనిషి ఉండాలనే తపన కవిలో కనిపిస్తుంది. వాస్తవంగా కూడా ఇది నరసింహారెడ్డి వ్యక్తిత్వమేనని బోధపడుతుంది.
పల్లెల్లో ఉండే పలకరింపులు గాని, ఊరు వాతావరణం గాని, పల్లె వాసులు వాడే పడికట్టు పదాలుగాని, నుడికారాలతో ముడవడి అక్కడి జీవన విధానం తన రచనల్లో స్పష్టంగా ప్రత్యక్షమవుతాయి. పల్లె నేపథ్యం ఉన్న కవి కనుకనే సామాన్యుని వాడుక భాషా పదాలు పరిపుష్టంగా వాడారు. వాటిలో 'పిట్ట' పద ప్రయోగం కవిత్వానికి అందంగాను ఉంటుంది. సామన్యుని వాడుక భాష కుడా.

**- తాళ్ళూరి రవీంద్ర రావు**
**9177491233**

# శ్రీనివాసగిరిని ప్రకృతి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం



- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ
- శ్రీనివాసగిరిపై భక్తి పారవశ్యం.. భక్తులతో కలిసి నడిచిన మంత్రి పొంగులేటి
- అధికార ఆడంబరాలు పక్కన పెట్టి సామాన్యుడిలా కాలినడకన గిరిశిఖరానికి
- భార్య మాధురితో కలిసి స్వామివారికి పట్టువస్త్రాల సమర్పణ
- వైభవంగా శ్రీనివాసుని కల్యాణం గోవింద నామస్మరణతో మార్మోగిన పాల్వంచ

**భద్రాద్రి బ్యూరో, మహా:** శ్రీనివాసగిరిని ప్రకృతి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన తిరుకల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. కొండపై వేద పండితుల మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణ వేడుక అత్యంత వైభవంగా సాగింది. ఈ పుణ్యకార్యంలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన భార్య మాధురితో కలిసి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.దర్శనం తర్వాత మంత్రి మాట్లాడుతూ ప్రకృతి ఒడిలో ఉన్న శ్రీనివాసగిరిని దర్శించుకోవడం నా అదృష్టమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అటవీ శాఖ అధికారుల సహకారంతో ఈ క్షేత్రాన్ని గొప్ప ఎకో టూరిజం(ప్రకృతి పర్యాటక) కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తాం అని చెప్పారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆ స్వామిని వేడుకున్నట్లు తెలిపారు.

**సామాన్య భక్తుడిలా..**

ఈ వేడుకలో అందరినీ ఆకట్టుకున్న ప్రధానాంశం మంత్రి పొంగులేటి దంపతుల రాక. సామాన్యుడిలా భక్తుల 1,600 మెట్లను కాలినడకన ఎక్కుతూ గిరిశిఖరానికి చేరుకున్నారు. దారి పొడవునా గోవింద నామస్మరణ చేస్తూ తనను పలకరించిన భక్తులకు చిరునవ్వుతో సమాధానమిస్తూ ముందుకు సాగారు. దేవుని దగ్గర అందరూ సమానమే అని ఆయన చాటిచెప్పారు.

**లోక కల్యాణం కోసం 'సిరి' కల్యాణం..**

ఆలయానికి చేరుకున్న మంత్రి దంపతులకు ఆలయ కమిటీ ఘనస్వాగతం పలికారు. స్వామివారికి మంత్రి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన కళ్యాణ వేడుకను భక్తిశ్రద్ధలతో వీక్షించారు. పండితులు వారికి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామానికి రహదారి ఏర్పాటు చేస్తాం

**అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లులు ఇస్తా.. సీసీ, బీటీ రోడ్ల శంకుస్థాపన.. కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ ఎమ్మెల్యే పాయం**



**పినపాక ,మహా:** కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి సంక్షేమ పథకం అందుతుందని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఆయన పినపాక మండలంలో పర్యటనలో భాగంగా గ్రామ పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలు ఘనంగా ప్రారంభించారు.ఉదయం 9 గంటలకు పలు సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ అభివృద్ధికి కీలకమైన రహదారుల పనులను ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జానంపేట నుంచి భూపతిరావుపేట వరకు రహదారి, జానంపేట నుంచి అమరారం వరకు రోడ్, వెంకటేశ్వరపురం నుంచి మల్లారం వరకు రహదారి, మల్లారం నుంచి చినరాజుపేట వరకు రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ రోడ్ల నిర్మాణంతో గ్రామాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు ప్రజలకు సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. ముఖ్యంగా రైతులు, విద్యార్థులు, గ్రామస్తులకు ఈ రహదారులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం జానంపేట ప్రభుత్వ హైస్కూల్‌లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్హులైన పలువురు యువతులకు కల్యాణ లక్ష్మి ఆర్థిక సహాయ చెక్కులను అందజేశారు. ఈ పథకం ద్వారా ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు పెళ్లి ఖర్చులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయం ఎంతో ఉపశమనం కలిగిస్తోందని లబ్ధిదారులు తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. రోడ్లు, మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతం అవుతుందని అన్నారు. ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం, జానంపేట సర్పంచ్ పూనం ఉమామహేశ్వరి, ఉప సర్పంచ్ రాజేష్, జానంపేట సెక్రటరీ కాజా హుస్సేన్, వివిధ గ్రామ పంచాయతీల సెక్రటరీలు, సర్పంచులు, జానంపేట కాంగ్రెస్ నాయకులు పేరం వెంకటేశ్వర్లు, హరీష్ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ నాయకులు, లబ్ధిదారులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజకీయ విశ్లేషకుడు నాగేశ్వర్ సేవలు అభినందనీయం

**ఆయనను సత్క రించి అభినందించిన ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్**



**భద్రాద్రి బ్యూరో, మహా:** ప్రముఖ రాజకీయ సామాజిక విశ్లేషకుడు ఎక్స్ ఎమ్మెల్సీ నాగేశ్వర్ ను సుగుణ గార్డెన్స్ లో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు అభ్యుదయ కళా సేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కవి సినీ గీత రచయిత, గాయకులు సమాజసేవకులు, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ తాను బాల్యం నుండి నాగేశ్వర్ అభిమానిని అని పేర్కొన్నారు. డాక్టర్ నాగేశ్వర్ గత 40 సంవత్సరాలుగా రాజకీయంగా సామాజికంగా నిష్పక్షపాతంగా నిర్భయంగా అన్ని కోణాలలో తమ విశ్లేషణలను అందిస్తూ అటు ప్రజలను ఇటు సమాజాన్ని జాగృతం చేస్తున్నారని వివరించారు. రెండుసార్లు ఎమ్మెల్సీగా కూడా విశిష్టమైన సేవలు అందించారని వారు చేస్తున్న ఈ సుదీర్ఘమైన అనంతమైన పోరాటం బాబాసాహెబ్ అంబేద్కర్ కలలు కన్న ఒక మంచి సమ సమాజాన్ని ఏర్పాటు చేయడానికి, ఆ సమ సమాజంలో అందరూ సమాన హక్కులతో సమాన స్వాతంత్రంతో సమాన ఫలాలు పొందుతూ సంతోషంగా జీవించడానికి దోహదపడుతుందని వారు భవిష్యత్తులో ఇంకా విస్తృతమైన సేవలను అందించి వర్ధిల్లాలని ఆచార్య డాక్టర్ మద్దెల ప్రశంసించారు. ఈ ఆత్మీయ అభినందన కార్యక్రమంలో ప్రొఫెసర్ నాగేశ్వర్, ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ లతోపాటు కొత్తగూడెం శాసనసభ్యులు కూనం నేని సాంబశివరావు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూదు గణేష్, సిపిఐ జిల్లా పార్టీ సెక్రటరీ ఎస్ కే సాబీర్ పాషా, రికగ్నైజ్డ్ యూనియన్ ఏఐటీయూసీ సెంట్రల్ కమిటీ సెక్రటరీ వంగా వెంకట్, రాష్ట్ర ఎమ్మార్పీఎస్ నాయకులు గుండా రమేష్, అశోక్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపసర్పంచుల సంఘం మండల కమిటీ ఎన్నిక



- పినపాక ఉపసర్పంచ్ ల సంఘం అధ్యక్షులుగా దాట్ల రాజేష్(జానంపేట)
- ఉపసర్పంచుల సంఘం ఉపాధ్యక్షులుగా అచ్చా నవీన్ (తోగ్గూడెం)

**పినపాక, మహా:** పినపాక మండలం గ్రామ పంచాయతీల లోని ఉప సర్పంచుల సంఘం కమిటీ కొరకు రాళ్లవాగు దగ్గర సమావేశాన్ని ఆదివారంఏర్పాటు చేసుకున్నారు. పినపాక మండలానికి ఉప సర్పంచ్ల సంఘం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఉప సర్పంచ్ల సంఘం అధ్యక్షులుగా దాట్ల రాజేష్ (జానంపేట), ఉపాధ్యక్షులుగా అచ్చా నవీన్ (తోగ్గూడెం), ప్రధాన కార్యదర్శి కోడం రామ్మోహన్ (ఉప్పాక), ట్రెజరర్ లుగా నిట్టా శిరీష(భూపాలపట్నం),ఆరె స్రవంతి(సీతంపేట) సహాయ కార్యదర్శులుగా గంగిరెడ్డి సందీప్ రెడ్డి(బయ్యారం),కొమరం ధనలక్ష్మి(బోటిగూడెం) ఏకగ్రీవంగా ఎన్నిక జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు దాట్ల రాజేష్ మాట్లాడుతూ ఉపసర్పంచులకు ఎటువంటి సమస్యలు ఉన్న వాటి పరిష్కారాన్ని కృషి చేస్తానని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో ఉపసర్పంచులు ఆకుల సందీప్, రావిల్లా నర్సమ్మ, ఎడ్ల సారమ్మా, జిమ్మిడి వెంకటేశ్వర్లు, బోడ తిరుపతి,బొంపెల్లి కిషోర్,కాల్లా చంటి ముఖ్య అతిధిగా మండల నాయకులు పేరం వెంకటేశ్వర్లు హాజరయ్యారు.

# జనగణనను సమర్థవంతంగా నిర్వహించాలి



**జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి బ్యూరో, మహా:** భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జనాభా గణన-2027 కార్యక్రమాన్ని జిల్లాలో ఎటువంటి లోపాలు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. జనగణనలో భాగంగా మొదటి దశ అయిన గృహాల జాబితా గృహ వసతుల గణనపై జిల్లా ఛార్జ్ స్థాయి అధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తో కలిసి ఆదివారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమంలో అధికారులు జనగణన డేటా సేకరణ విధానంపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. జిల్లాలో జనాభా గణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన విధి విధానాలు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. జనగణన ప్రక్రియను క్రమబద్ధంగా నిర్వహిస్తూ డేటా సేకరణ సమయంలో ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశించారు. అధికారులు సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జనగణన ప్రక్రియను పారదర్శకంగా లోపరహితంగా పూర్తి చేసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలపాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. శిక్షణ కార్యక్రమంలో జనగణనపై డిజిటల్ విధానంలో అవగాహన కల్పించేందుకు జనగణన విభాగం అధికారులు, ట్రైనర్లు సాఫ్ట్‌వేర్ ద్వారా వివరాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. జనగణన ద్వారా సేకరించే గణాంకాలు గ్రామ పట్టణ రాష్ట్ర జాతీయ స్థాయిలలో అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు పునాది వంటివని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలు ఆసుపత్రులు రహదారులు తాగునీటి సదుపాయాలు వంటి మౌలిక వసతుల కల్పనకు అలాగే సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు చేరవేయడానికి ఖచ్చితమైన గణాంకాలు అత్యంత అవసరమని తెలిపారు. ఈసారి జనాభా లెక్కలు పూర్తిగా మొబైల్ యాప్ ద్వారా సేకరించబడతాయని తెలిపారు. పౌరులు తమ వివరాలను ఆన్‌లైన్ ద్వారా స్వయంగా నమోదు చేసుకునే సౌకర్యం కూడా కల్పించనున్నట్లు చెప్పారు. మొదటి దశలో ఇళ్ల జాబితా సేకరణ, రెండో దశలో జనాభా వివరాల సేకరణ జరుగుతాయని వివరించారు. ప్రతి ఎన్యూమరేటర్ తనకు కేటాయించిన లాగిన్ వివరాలతో యాప్‌ను సక్రమంగా వినియోగించడం డేటా ఎంట్రీ చేయడం సర్వర్‌కు లింక్ చేయడం వంటి అంశాల్లో నైపుణ్యం సాధించాలని కలెక్టర్ సూచించారు. వయస్సు విద్యార్హత వృత్తి సామాజిక వర్గం మౌలిక వసతుల వివరాలు వంటి అంశాల్లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. ఖచ్చితమైన సమాచారం మాత్రమే నమోదు చేయాలని అన్నారు. గృహ నిర్మాణం నీటి వనరు మరుగుదొడ్డి విద్యుత్ వంట ఇంధనం ఇంటర్నెట్ సౌకర్యం వంటి 33 అంశాలపై సమగ్ర సమాచారం సేకరించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సిపిఓ సంజీవరావు, జెడ్పిసిఈఓ నాగలక్ష్మి కొత్తగూడెం ఆర్డీవో మధు, ఉదయ భాస్కర్ గణాంక అధికారి, ఈడియం సైదేశ్వరరావు, మాస్టర్ ట్రైనర్లు, తాసిల్దార్లు ఎంపీడీవోలు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం





**పిపిఈ కిట్లు అందజేత**


**జూలూరుపాడు, మహా:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా మండల పరిధి వెంగన్నపాలెం, అనంతారం, గుండెపుడి, సూరారం, నల్లబండబోడు, కొమ్ముగూడెం, గుండ్లరేవు గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను గౌరవిస్తూ, అధికారులు, ప్రజా ప్రతినిధులు వారిని శాలువాతో ఘనంగా సన్మానించి పిపిఈ కిట్లను అందజేశారు. సమాజ ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం వారు చేస్తున్న అమూల్యమైన సేవలను అభినందించారు. వెంగన్నపాలెం గ్రామపంచాయతీలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపిడిఓ తాళ్లూరి రవి, గుండెపుడి గ్రామపంచాయతీలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఎంపీఓ తులసీరామ్ పాల్గొనగా, వివిధ గ్రామపంచాయతీలలో ఆయా సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హామీలు అమలు చేయాలని సంతకాల సేకరణ



**జూలూరుపాడు, మహా:** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ మండల కేంద్రంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ మాట్లాడుతూ రేపు జరగబోయే అసెంబ్లీ సమావేశంలో బిజెపి శాసనసభ్యులు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రైతుల నుంచి సేకరించిన సంతకాలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కి అందజేస్తామని తెలిపారు. నెలలు, ఏళ్లు గడుస్తున్న ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు బీమా, రైతు భరోసా, రైతు రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు చేయూతలాంటి పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులకు, పేదలకు అన్యాయం చేస్తుంటే, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పుట్టిన కమ్యూనిస్టులు ఈ రోజు కాంగ్రెస్ కు ఎందుకు మద్దతిస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణలో ప్రస్తుతం గ్యాస్ కొరత లేదు కానీ బ్లాక్ మార్కెట్లోకి వెళ్ళిపోకుండా, కమ్యూనిస్టు పార్టీలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మీద ఒత్తిడి తెస్తే పేద ప్రజలకు, రైతులకు న్యాయం జరుగుతుందని అన్నారు. కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మాదినేని సతీష్, జిల్లా నాయకులు నున్న రమేష్, బిజెపి మండల అధ్యక్షుడు భూక్య రమేష్, తెల్లం నరసింహారావు, కిసాన్ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి సిరిపురపు పుల్లారావు, నిమ్మటూరి రామారావు, సిరిపురపు గోపాలరావు, నర్వనేని కృష్ణ, వందనపు సుబ్బు పాల్గొన్నారు.


# గుండెపిన్నిని పరామర్శించిన కూనంనేని



**జూలూరుపాడు, మహా:** ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ జూలూరుపాడు సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు ను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు, కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా తో కలసి ఆదివారం పరామర్శించారు. ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనే వెంకటేశ్వర్ల కు ప్రమాదం జరగటం పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గాయాల నుండి త్వరగా కోలుకోవాలని, వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎల్లంకి మధు, గుడిమెట్ల సీతయ్య, కంచర్ల రాఘవేంద్రరావు, అనుమల అశోక్, చెరుకుమల్ల రామకృష్ణ, షేక్ బుడెన్ పాషా, పత్తిపాటి మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే చాంద్ పాషా తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

# ఓబీ కంపెనీల నిర్లక్ష్యం.. డ్రైవర్ల ప్రాణాలతో చెలగాటం..

- ఫిట్నెస్ లేని వాహనాలతో కార్యకలాపాలు..
- చర్యలు తీసుకోవాలని రేణుక అక్షర మహిళా మండలి డిమాండ్..
- ఓబి కంపెనీల పై పర్యవేక్షణ లేదంటూ అధికారులపై విమర్శలు..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పని చేస్తున్న ఓబీ కంపెనీలు ఫిట్నెస్ లేని వాహనాలతో కార్యకలాపాలు నిర్వహిస్తూ డ్రైవర్ల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయని రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ ఆరోపించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మణుగూరులోని దుర్గ, గౌరవ్ ఓబీ కంపెనీలలో నడుస్తున్న అనేక వాహనాలకు ఫిట్నెస్ సర్టిఫికెట్లు లేకపోయినా అవే వాహనాలతో పనులు కొనసాగిస్తున్నారని తెలిపారు. కాలం చెల్లిన, ప్రమాదకర స్థితిలో ఉన్న వాహనాలతో భారీ కంపెనీలు నడపడం వల్ల డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రమాదం జరిగితే డ్రైవర్ల ప్రాణాలే పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి వాహనాలను తక్షణమే తనిఖీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆమె డిమాండ్ చేశారు. అదేవిధంగా మణుగూరులో ఇసుక ర్యాంపుల నుంచి అధిక లోడింగ్ ఇసుక లారీల రాకపోకల వల్ల ప్రధాన రహదారులు పూర్తిగా గుంతల మయంగా మారి ప్రమాదాలకు దారి తీస్తున్నాయని ఆమె ఆరోపించారు. భారీ ఇసుక లారీలతో పాటు ఫిట్నెస్ లేని వాహనాలు రోడ్లపై తిరుగుతున్నప్పటికీ రవాణా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఓబీ కంపెనీలు, ఇసుక బినామీ కాంట్రాక్టర్ల నుంచి నెలవారీ మామూళ్ల మత్తులో అధికారులు వాహనాల కాగితాలను మాత్రమే తనిఖీ చేసి వాహనాల ఫిట్నెస్ కు సంబంధించి వాస్తవ పరిస్థితిని చూడడం లేదని ఆరోపించారు. సింగరేణి అధికారులు రక్షణతో కూడిన ఉత్పత్తి కోసం కార్మికులు శ్రమించాలని నినాదాలు ఇస్తున్నప్పటికీ ఓబీ కంపెనీల్లో ఫిట్నెస్ లేని వాహనాల కారణంగా జరుగుతున్న ప్రమాదాలను పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. సింగరేణి సేఫ్టీ అధికారులు, మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్‌లు నిజంగా తనిఖీలు నిర్వహిస్తున్నారా లేదా అన్నది అనుమానంగా ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అన్ని వాహనాలను సమగ్రంగా తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రేణుక అక్షర మహిళా మండలి ఆధ్వర్యంలో ఓబీ కంపెనీల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు ఎండి షబానా, కోరి శ్యామల, కన్నాపురం వసంత, దేరంగుల సుజాత, రెడ్డి బోయిన రేణుక, కన్నాపురం శైలజ, డాకూరి సౌజన్య, లెక్కింశెట్టి హేమలత తదితరులు పాల్గొన్నారు.

# ఖురాన్ బోధనలకు అనుగుణంగా జీవన పయనం సాగితే సకల రంగాల్లో అభివృద్ధి

**జమాతే ఇస్లామి హింద్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా అజారుద్దీన్**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఖురాన్ బోధనలు అనుగుణంగా జీవన పయనం సాగితే సకల రంగాల్లో అభివృద్ధి చెందవచ్చు అని తెలాంంగాణ రాష్ట్ర జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షులు మౌలానా అజారుద్దీన్ అన్నారు. పవిత్ర రంజాన్ మాసం లో లైలతుల్ ఖద్ర్ రాత్రి అన్వేషణ సందర్భంగా స్థానిక కొత్తగూడెం జిల్లా బస్ డిపో ప్రాంతం లోని "బైతుల్ నూర్ " మస్జిద్ లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలోని సకల సమస్యలు పరిష్కారం ఖురాన్ బోధనల అర్థం చేసుకొని ఆచరించడం ద్వారానే సాధ్యం అని అన్నారు. జీవితం క్షణభంగురమని శాశ్వత జీవితం మరణం తర్వాత జీవితం అని ఆ జీవితం కోసం ఇక్కడ సకల రంగాల్లో చెడును ఆధర్మ పనుల నుంచి దూరంగా ఉండేలా ఉపవాసాలు శిక్షణ గరుపుతాయని అన్నారు. రంజాన్ మాసంలో అవతరించిన ఖురాన్ బోధనలను సర్వ వ్యాప్తి చేసి దైవభీతి ఆధార సత్ సమాజ నిర్మాణం గావించాలని కోరారు. సమాజంలో అశాంతి అధర్మ పనులు దూరం కావాలని కులమతాలకు అతీతంగా మానవ సమాజ కలిసి మెలిసి అన్నదమ్ముల్లా జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ ఇమామ్ మౌలానా, మునవ్వర్, హుస్సేన్, అధ్యక్షులు నహీం ఖురేషి, జమాతే ఇస్లామి సభ్యులు షారుఖ్ యజ్దాని, రియాజ్, జహంగీర్, రబ్బానీ, రహీం సాబ్, అబ్దుల్ బాసిత్, ఖుత్బుదీన్, తదితరులు పాల్గొన్నారు.



## పీకే ఓసి డిప్ సైడ్ గని సింగరేణికే కేటాయించాలి

- కాంట్రాక్ట్ కార్మికుల వేతన సమస్యను అసెంబ్లీలో చర్చించాలని..
- ఎమ్మెల్యే పాయంకు ఐఎఫ్‌టీయూ వినతి..



**మణుగూరు, మహా :** మణుగూరు ఏరియా మనుగడతో పాటు సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం పీకే ఓసి డిప్ సైడ్ గనిని సింగరేణికే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుకు ప్రజాభవన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యస్.డి నాసర్ పాషా మాట్లాడుతూ.. మణుగూరు ప్రాంత అభివృద్ధికి, సింగరేణి సంస్థ భవిష్యత్తుకు పీకే ఓసి డిప్ సైడ్ గని ఎంతో కీలకమని తెలిపారు. ఈ గనిని సింగరేణికే కేటాయించి సంస్థ ఉద్యోగుల చేతనే నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతన పెంపు సమస్యను కూడా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశాలను చర్చించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. పర్మినెంట్ కార్మికులకు సంబంధించిన దీర్ఘ కాలిక సమస్యలను కూడా పరిష్కరించాలని, మెడికల్ బోర్డు నిర్వహణ, కారుణ్య నియామకాలు కొనసాగింపు, సింగరేణి ఉద్యోగుల ఆదాయపు పన్నులో పేర్క్స్ విధింపును ఉపసంహరించాలని కోరారు. అలాగే సింగరేణి ఉద్యోగుల కోసం హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించే ఆసుపత్రి నిర్మించాలని, కార్మికుల సొంత ఇంటి కలను నెరవేర్చాలని, కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ వైద్యసేవలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ఏరియా అధ్యక్షుడు అంగోత్ మంగీలాల్, వై సంజీవరావు, కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీనివాస కళ్యాణ మహోత్సవం

**పాల్గొన్న మంత్రులు పొంగులేటి, తుమ్మల**

**భద్రాద్రి బ్యూరో, మహా:** పాల్వంచ పట్టణంలోని శ్రీనివాసగిరి కాలనీలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించిన శ్రీనివాస కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీసమేతంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ సహకార జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన మంత్రులకు ఆలయ నిర్వాహకులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు ఇద్దరూ శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమం భక్తి వాతావరణంలో వైభవంగా నిర్వహించబడింది. తదనంతరం నిర్వహించిన శ్రీనివాస కళ్యాణ మహోత్సవంలో మంత్రులు ఇద్దరూ భక్తులతో కలిసి కార్యక్రమాన్ని భక్తి పరవశంతో వీక్షించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలు ఆశీర్వాదాలను మంత్రులకు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ శ్రీనివాసగిరి గుట్ట ప్రాంతాన్ని పర్యాటక రంగంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రకృతి వనంలో ఉన్న ఈ పవిత్ర క్షేత్రాన్ని అటవీశాఖ సహకారంతో అభివృద్ధి చేసి గొప్ప ఈకో టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో భక్తి భావాన్ని, ఐక్యతను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కృపతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## మధుర బస్తీలో రంజాన్ తోఫాల పంపిణీ



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** రంజాన్ మాసం పురస్కరించుకొని కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని మధుర బస్తీ కమిటీ హాల్లో ఆదివారం ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ తోఫాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. పేద కుటుంబాలకు అవసరమైన బియ్యం నిత్యావసర సరుకులు ఇతర రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. రంజాన్ నెలలో అవసరమైన వారికి సహాయం చేయడం గొప్ప సేవ అని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధుర బస్తీ కార్పొరేటర్ దుంపల రాజేష్, ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు మహమ్మద్ రియాజ్, నాయకురాలు మహమ్మద్ రెహానా తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ గౌరీ ప్రసాద్‌ను సన్మానించిన వాసవిక్లబ్

**ఏరియాలో మెరుగైన వైద్య సేవలందించాలని విజ్ఞప్తి**



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని వంద పడకల ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సూపరింటెండెంట్ డాక్టర్ గౌరీ ప్రసాద్‌ను ఆదివారం మణుగూరు వాసవి క్లబ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ప్రతినిధులు పుష్పగుచ్ఛం అందజేసి ఆయనను అభినందించారు. ఆసుపత్రి అభివృద్ధి దిశగా ముందుకు సాగుతూ మణుగూరు ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో డాక్టర్ గౌరీ ప్రసాద్ విజయవంతం కావాలని వాసవి క్లబ్ సభ్యులు ఆకాంక్షించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తాము కూడా సహకారం అందిస్తామని తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం స్థానిక సంస్థలు, సేవా సంస్థలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. డాక్టర్ గౌరీ ప్రసాద్ వాసవి క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి సిబ్బందితో కలిసి కృషి చేస్తానని డాక్టర్ గౌరీ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రెసిడెంట్ శ్యామ్, పుర ప్రముఖులు దోసపాటి నాగేశ్వరరావు, క్లబ్ ప్రతినిధులు గౌరీ శంకర్, సముద్రాల కిషోర్, క్లబ్ జిల్లా బాధ్యులు బండారు నరసింహారావు, చిత్తలూరు రమేష్ బాబు, శేషు కుమార్, దింటకుర్తి బ్రహ్మయ్య, చిత్తలూరి ఉమ తదితరులు పాల్గొన్నారు.

## గౌరవ డాక్టరేట్ పొందిన లక్ష్మణరావుకు ఘన సన్మానం



**మణుగూరు, మహా :** పినపాక నియోజకవర్గానికి చెందిన ఏఈఓ, సీనియర్ ఆదివాసి నాయకులు కొమరం లక్ష్మణరావుకు గౌరవ డాక్టరేట్ లభించిన సందర్భంగా ఆయనను తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య ఘనంగా సన్మానించారు. ఆదివారం మణుగూరులోని ఆయన స్వగృహంలో చైర్మన్ వీరయ్య కలిసి అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ ద్వారా భారత ప్రభుత్వం, నీతి ఆయోగ్‌కు అనుబంధంగా గౌరవ డాక్టరేట్ అందుకోవడం లక్ష్మణరావు చేసిన సేవలేనని కొనియాడారు. ఆదివాసీలు, అనగారిన వర్గాల అభివృద్ధి కోసం కొమరం లక్ష్మణరావు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. సమాజ సేవలో ఆయన చూపుతున్న నిబద్ధత ఆదర్శప్రాయమన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ ప్రజా శ్రేయస్సు కోసం మరింతగా కృషి చేయాలని ఆకాంక్షించారు. కొమరం లక్ష్మణరావు మాట్లాడుతూ తాను పొందిన ఈ గౌరవం ఆదివాసీ సమాజానికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధి కోసం తన సేవలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కుర్రి చలపతి, మానుకొండ రఘురాం, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## బాధితుల వైద్య చికిత్సలకు సహాయం

- ఎల్‌ఓసీలు అందజేసిన ఎమ్మెల్యే పాయం
- రూ.7 లక్షల విలువైన సహాయం మంజూరు..



**మణుగూరు, మహా :** అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఎల్‌ఓసీలు (లెటర్ ఆఫ్ క్రెడిట్) అందజేశారు. ఆదివారం మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజా భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం రూ.7 లక్షల విలువైన ఎల్‌ఓసీలను లబ్ధిదారులకు అందించారు. ఎల్‌ఓసిలు మంజూరైన బాధితులలో అశ్వాపురం మండలం అమెర్ద గ్రామపంచాయతీకి చెందిన కాపుల సుజాతకు రూ.5 లక్షల విలువైన ఎల్‌ఓసీని ఎమ్మెల్యే అందజేశారు. అలాగే మణుగూరు మండలం బొంబాయి కాలనీకి చెందిన కంచె శ్రీనివాస్‌కు రూ.2 లక్షల విలువైన ఎల్‌ఓసీని మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్య చికిత్స పొందేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ప్రభుత్వం ద్వారా వైద్య సహాయం అందించేందుకు తాము ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటాన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పీరినాకి నవీన్, పాతూరు వెంకన్న, కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## పాల్వంచ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి

- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర
- కళ్యాణ మహోత్సవానికి హాజరైన వద్దిరాజు
- పాల్వంచ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు
- పాల్గొన్న బీఆర్ఎస్ పాల్వంచ మహిళా కార్పొరేటర్ మల్లెల స్వప్న కుమారి రవిచంద్రతో పాటు మరికొందరు ప్రజా ప్రతినిధులు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ శ్రీనివాసగిరిలో కొలువైన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని తమ పార్టీ ఎంపీల నిధుల నుంచి కోటి 50 లక్షల రూపాయలు అందజేస్తామని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర హామీ ఇచ్చారు. ఈ ఆలయంలో ఆదివారం జరిగిన స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి ఎంపీ రవిచంద్ర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ ఆలయానికి భక్తులు వెళ్లేందుకు రోడ్డు లేనందున ఇందుకోసం భక్తుల సౌకర్యార్థం కొరకు తనతో పాటు బీఆర్ఎస్ ఎంపీలు డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి, దీవకొండ దామోదర్ రావుల ప్రత్యేక నిధుల నుంచి 50 లక్షల చొప్పున మొత్తం కోటిన్నర రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అవసరమైతే మరో 50 లక్షల రూపాయలు కూడా విడుదల చేయిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముందుగా ఆలయ కమిటీ ప్రముఖులు, అర్చకులు ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు దిండిగల రాజేందర్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతామహాలక్ష్మీ తదితరులకు సాదర స్వాగతం పలికారు. అర్చకులు వారికి పూలమాలలు వేసి శాలువాలు, కండువాలతో సత్కరించారు. వేద పండితులు వారికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ బి ఆర్ ఎస్ పార్టీ కార్పొరేటర్ మల్లెల స్వప్న కుమారి రవిచంద్రతో పాటు మరికొందరు బిఆర్ఎస్ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సిబ్బందికి సన్మానం



**బూర్గంపహాడ్ మహా :** కోయగూడెం పంచాయతీ ఎస్ టి కాలనీ లో గత కొంతకాలం గా లోవోల్టేజ్ సమస్య తో బాధపడుతున్న ప్రజలు సర్పంచ్ కుంజా కొండమ్మ కి సమస్య ని తెలియజేయగా వారు వెంటనే ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ వారి తో మాట్లాడి కొత్తగా ట్రాన్స్ఫారం పెట్టించి వారి సమస్య ను క్లియర్ జేయడం జరిగింది, ఈ సందర్భంగా కోయగూడెం సర్పంచ్ కుంజా. కొండమ్మ, ఉప సర్పంచ్ సున్నం కృష్ణవేణి ఏఈ ఉపేందర్కి లైన్మెన్ శ్రీనివాసస్ కి, హనుమంత్ కి శాలువా కప్పి సన్మానించడం జరిగింది, ఈ కార్యక్రమం లో వార్డు మెంబర్స్ బొర్రా రమేష్ గారు, సోడే సునీత,సున్నం వెంకట లక్ష్మి, గ్రామ పెద్దలు మడకం రామయ్య, సున్నం పోతయ్య సున్నం మోహన్ రావు కొండలరావు, శంకర్ , శ్రీను , రంజిత్ మహిళలు, యువకులు పాల్గొనడం జరిగింది

## గ్రామ పంచాయతీ సిబ్బందికి ఘన సన్మానం..



**మణుగూరు /అశ్వాపురం, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం గ్రామ పంచాయతీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బందిని ఘనంగా సన్మాన సన్మానించారు. ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బానోత్ సదర్ లాల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ సదర్ లాల్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో గ్రామ పంచాయతీ సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామంలో ప్రజలు ఆరోగ్యవంతమైన వాతావరణంలో జీవించేందుకు వారు చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా సేవా భావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుళ్ళూరి ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి కందిమళ్ల శ్రీకాంత్, వార్డు సభ్యులు వేములపల్లి హసిత, ధనలక్ష్మి, అనుపమ, కౌసల్య, గ్రామ అభివృద్ధి అధికారి బాలకృష్ణ, ఫీల్డ్ సహాయకుడు లక్ష్మణ్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి ఎద్దడికి చర్యలు తీసుకోవాలి



- అర కొర ట్యాంకర్ల ద్వారా నీటి ఎద్దడి నివారించలేం
- హ్యాండ్ బోర్లు వినియోగంలోకి తేవాలి
- ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి
- కార్పొరేటర్ మునిగడప పద్మ

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రామవరంలో నెలకొన్న నీటి ఎద్దడిని యుద్ధ ప్రాతిపదికన నివారణకు చర్యలు తీసుకొని తక్షణమే ఇంటింటికి మంచి నీళ్ళు అందించాలని 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం డివిజన్ కు ట్యాంకర్ల ద్వారా నీళ్లు అందించడానికి కృషి చేసిన కార్పొరేటర్ పద్మ మాట్లాడుతూ కొత్త పైపుల ద్వారా నీటిని అందించడంలో కొంత జాప్యం జరుగుతుందని కానీ ఎండాకాలం దృష్ట్యా ప్రజలు నీటికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు ఇది గమనించాలని సూచించారు. జనాభాకు తగ్గట్టుగా కార్పొరేషన్ లో నీటి ట్యాంకర్లు లేకపోవడం వల్ల ప్రత్యామ్నాయంగా మంచినీళ్ళను అందించలేకపోవడం బాధాకరమైనదని అన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. అన్ని వార్డుల్లో ఉన్న హ్యాండ్ పంపులు, మినీ వాటర్ బోర్లు ఉపయోగంలోకి తేవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. 16వ డివిజన్లో అవసరం ఉన్న చోట టాంకర్ల ద్వారా మంచినీరు అందించడం జరిగిందని అన్నారు. ప్రజల అవసరాలకు తగ్గట్టుగా టాంకర్లు లేవని అన్నారు. 125 కోట్లతో చేపట్టిన మిషన్ భగీరథ పనులను త్వరితగతన పూర్తిచేసి ప్రతి ఇంటికి మంచి నీళ్లు అందించాలని లక్ష్యంతో స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అధికారులను ఆదేశించినట్లు ఆమె తెలిపారు. వీరి వెంట మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునగడప వెంకటేశ్వర్లు, పంపు డ్రైవర్ జి.శంకర్, రాకేష్, చారి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## నందమూరి సుహాసిని మండలంలో పర్యటన...



**తల్లాడ, మహా:** నందమూరి సుహాసిని నందమూరి హరికృష్ణ కుమార్తె ఖమ్మం జిల్లాలోని వేంసూరు మండలం లచ్చన్నగూడెంలో స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావు కాంస్య విగ్రహావిష్కరణకు ఆదివారం విచ్చేశారు. దీనిలో భాగంగా గానే తల్లాడ మండలంలోని తెలుగుదేశం మండల అధ్యక్షుడు సరికొండ శ్రీనివాసరాజు ఇంటి వద్ద తేనేటి విందులో పాల్గొన్నారు. అంతకుముందు ఆమెకు అభిమానులు పూలమాలతో ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి నాయకుడు కేతినేని హరీష్,మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ ధూపాటి భద్రరాజు, మాజీ ఎంపీపీ సరికొండ.లక్ష్మి పద్మావతి, రమణమ్మ, కూచిపూడి వేంకటేశ్వర రావు, దుగ్గినేని.వేంకటేశ్వర్లు, నా రపోగు ప్రసాద్,కొమ్మినేని.సత్యనారాయణ, మొక్క. సత్యనారాయణ, మొక్క.క్రిష్ణ ర్జున్, పెరిక. కిట్టు, కస్తూరి రాజు, గుమ్మా.హరి,తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో రంజాన్ కిట్లు పంపిణీ



**బూర్గంపహాడ్ మహా :** రంజాన్ పండుగ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని బూర్గంపహాడ్ మరియు సారపాక జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు మండల కేంద్రంలోని యాసీన్ మసీద్ మరియు సారపాకలోని బసప్ప క్యాంపు కాలనీలో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ ప్రతినిధులు మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా మెరుగుపడినటువంటి వారందరూ వారు సంపాదనలో 2.5%జకాత్ రూపంలో తీసి నిరుపేదలకు తోడ్పాటు అందించాలని అల్లా యొక్క ఆదేశం మేరకు మేము మా జమాతే ఇస్లామిక్ హింద్ ఆధ్వర్యంలో దాదాపుగా కొన్ని సంవత్సరాలుగా రంజాన్ తోఫా అందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు కూడా ఇదే విధంగా వారి ఆదాయంలో 2.5% జకాత్ రూపంతో చెల్లించే నట్లయితే దేశంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించొచ్చు అన్నారు నిరుపేదలందరూ కూడా రంజాన్ పండుగ సంతోషంగా జరుపుకోవాలని రంజాన్ తోఫ ఇవ్వడం జరుగుతుందన్నారు ఈ రంజాన్ తోఫాలో దాదాపుగా 10 రకాల వస్తువులను ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ సభ్యులు జహీర్ పాషా. అబ్దుల్ సలీం. సైదుద్దీన్. ఇర్షాద్.ఇమ్రాన్. షహబాజ్. బూర్గంపహాడ్ సారపాక గ్రామ పెద్దలు. షేక్ దస్తగీర్. మహమ్మద్ అబ్దుల్ జబ్బర్. సయ్యద్ ఉమర్ హుస్సేన్. నవాబ్ జాని.వలి భాష. బషరత్. నాగూర్ వలి. తదితరులు పాల్గొన్నారు

## మణుగూరు గాయని పూజారి జ్యోతికి డైనమిక్ లేడీ సింగర్ అవార్డు

**మణుగూరు, మహా :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హన్మకొండలోని టీటీడీ కళ్యాణ మండపంలో డైనమిక్ లేడీ అవార్డ్స్-2026 కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. విస్డం చారిటబుల్ ట్రస్ట్, భగల మీడియా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన మహిళామణులను ముఖ్య అతిథుల చేతుల మీదుగా సన్మానించారు. మణుగూరుకు చెందిన గాయని పూజారి జ్యోతి తన ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు పొందిన నేపథ్యంలో ఆమెకు డైనమిక్ లేడీ సింగర్-2026 అవార్డును అందజేశారు. హన్మకొండ ఎమ్మెల్యే నాయని రాజేందర్ రెడ్డి, సతీమణి శైలజ ఇతర ముఖ్య అతిథులతో కలిసి ఈ అవార్డును పూజారి జ్యోతికి అందజేశారు. పూజారి జ్యోతి గాయనిగా మాత్రమే కాకుండా దిశ ఉమెన్ ప్రొటెక్షన్ వైస్ ప్రెసిడెంట్‌గా, అలాగే తెలుగు, తెలంగాణ బజ్ ఆఫ్ రికార్డు గ్రహీతగా సేవలు అందిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని నిర్వాహకులు ఈ సందర్భంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమాన్ని విస్డం చారిటబుల్ ట్రస్ట్, భగల మీడియా ఆధ్వర్యంలో అనుమాండ్ల నాగరాజు, పద్మావతిలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరచిన మహిళామణులకు డైనమిక్ లేడీ అవార్డ్స్ అందజేశారు. ప్రముఖులు, ఆహ్వానితులు, మహిళా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో అవార్డుల ప్రధాన ఉత్సవంలో పాల్గొన్నారు.

# ప్రైవేటు స్కూల్ వద్దు.. సర్కార్ స్కూల్ ముద్దు...

**టంగుటూరు సర్పంచ్ జూకంటి అనిల్ కుమార్**




**ఆలేరు, మహా :** ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చి దిద్ది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత మన అందరిపై వుందని యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం టంగుటూరు గ్రామ సర్పంచ్ జూకంటి అనిల్ కుమార్ అన్నారు...ప్రైవేటు బడి వద్దు సర్కార్ బడి ముద్దు అనే నినాదంతో ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడి బాట కార్యక్రమం నేడు నిర్వహించారు... గ్రామంలో ప్రైవేటు స్కూల్కు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులతో సంప్రదించి ఉపాధ్యాయుల కొరత లేకుండా నాణ్యమైన విద్యా అందించేందుకు సర్పంచ్ వార్డ్ సభ్యులు గ్రామ పెద్దలతో భరోసా ఇచ్చి విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఈ బడి బాట కార్యక్రమం నిర్వహించారుకార్యక్రమంలో విద్యార్థుల మాట్లడిన ఇంగ్లీషు స్పేచ్,కరాటే ఆత్మ రక్షణ విద్య,సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామస్తులను అబ్బురపర్చాయిఈ కార్యక్రమంలో PRTU జిల్లా ప్రధానకార్యదర్శి మధు, ప్రాధమిక, ఉన్నత పాఠశాలలు ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి, రమాదేవి ,టీచర్స్ రవికుమార్, జాహాంగీర్,దాత కట్ట రాజి రెడ్డి, గ్రామ వార్డ్ సభ్యులు ,పెద్దులు నీల రామన్న, లక్ష్మి నారాయణ, వెంకటేష్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమ అనంతరం కరాటే మాస్టర్ క్రాంతి,డాన్స్ మాస్టర్ వేణులను సన్మానించారు...

# రుద్ర హాస్పిటల్ ప్రారంభించిన బీర్ల అయిలయ్య





**తుర్కపల్లి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన రుద్ర హాస్పిటల్‌ను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య రిబ్బన్ కట్ చేసి ఆసుపత్రిని ప్రారంభించి, ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలు, సదుపాయాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు సమీపంలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించడం ఎంతో అవసరమని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు చిన్న చిన్న వ్యాధులకే దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు తుర్కపల్లి పట్టణంలోనే ఆధునిక వైద్య సదుపాయాలతో హాస్పిటల్ ఏర్పాటు కావడం ఆనందదాయకమని పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేయడానికి పలు చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు. పేద మరియు మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు.

# ఘోర రోడ్డు ప్రమాదం ఇద్దరు యువకులు మృతి

**వలిగొండ, మహా :**వలిగొండ మండల పరిధిలోని ఆరూరు గ్రామ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుందిపోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాదు బోరబండకు చెందిన యువకులు ఆదివారం నాలుగు గంటల 30 నిమిషాల ప్రాంతంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుఎస్సై యుగంధర్ గౌడ్ తెలిపారు.



# ఏఎస్ రావు నగర్‌లో బస్తీ దవాఖాన భవనం విస్తరణకు శంకుస్థాపన

**కుషాయిగూడ, మహా :** ఉప్పల్ నియోజకవర్గంలోని డా. ఏఎస్ రావు నగర్‌లో ఉన్న బస్తీ దవాఖాన భవనం విస్తరణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై భవనం విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో బస్తీ దవాఖాన భవనాన్ని విస్తరించనున్నట్లు తెలిపారు. విస్తరణ పనులు పూర్తయిన అనంతరం మరింత మంది ప్రజలకు సౌకర్యవంతంగా వైద్య సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎస్. సోమశేఖర్ రెడ్డి, సిపిఐ నాయకుడు బోస్, డాక్టర్ సత్యవతి (పీఐసీ & ఎస్ఓ), డాక్టర్ ఆర్. కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేసిన బీర్ల అయిలయ్య




**తుర్కపల్లి, మహా:** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి పట్టణంలో ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నేడు ముస్లిం సోదరులకు రమజాన్ తోఫా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం శాంతి, సౌభ్రాతృత్వం, సేవా భావానికి ప్రతీక అని తెలిపారు. పేద కుటుంబాలకు ఉపవాస దినాల్లో ఉపయోగపడే విధంగా ప్రభుత్వం మరియు నాయకులు ఇలాంటి సహాయ కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందని అన్నారు.ప్రతి వర్గం ప్రజలు సంతోషంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ముస్లిం సోదరులు ఉపవాసాలు విజయవంతంగా పూర్తి చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

# 2027 జనాభా లెక్కలు దేశ అభివృద్ధికి కీలకం...

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**




**యాదాద్రి భువనగిరి, మహా:** 2027 జనాభా లెక్కలు దేశ అభివృద్ధికి ఎంతో కీలకం అని,అధికారులు పూర్తి అవగాహనతో, క్షేత్రస్థాయిలో బాధ్యతగా పని చేసి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి అనురాగ్ జయంతి పేర్కొన్నారు.జిల్లాలో జనాభా గణన- 2027 సమర్థంగా నిర్వహించేందుకు జిల్లా, మండల స్థాయి అధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి ఆదివారం కలెక్టర్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన నిబంధన ప్రకారం క్షేత్రస్థాయిలో అధికారులు పక్కాగా సర్వే నిర్వహించి జనాభా గణనచేయాలన్నారు.జిల్లా స్థాయిలో జనాభా గణనను సమర్థమంతంగా నిర్వహించేందుకు అవసరమైన విధానాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు .ఈ జనాభా గణన రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశలో హౌస్ లిస్టింగ్ (ఇళ్ల జాబితా) గృహాల గణన మే 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు, రెండో దశలో జనాభా గణన 2027 ఫిబ్రవరిలో జరుగుతుందని వివరించారు.జనన గణన 1872 లో మొదటి పాపులేషన్ సెన్సస్ చేయడం జరిగిందని అప్పుడు జరిగిన సెన్సస్ గురించి ఆన్లైన్ వెబ్ లోకి వెళ్లి చూసి అవగాహన చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఇచ్చిన నిబంధనలను ఎలా పాటిస్తారో సెన్సస్ 2027 కూడా అదే నిబద్ధతో నిబంధనల ప్రకారం అధికారులు పని చేయాలన్నారు. సెన్సస్ ఆపరేషన్ రెండు విడతలుగా ఉంటుందని దాంట్లో ముఖ్యపాత్ర చార్జ్ అధికారులదేనని అన్నారు. ఈసారి జరగనున్న జనాభా గణనను దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నారని,మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌లను ఉపయోగించి గణన ప్రక్రియను నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా సెన్సస్ డిజిటల్ గా మారిపోయిందని క్రియేషన్స్ చేసుకోవడం చాలా సులభకరంగా ఉంటుందని, ఎవరి మొబైల్ ఫోన్లో వారే సొంతంగా అప్లికేషన్లు డౌన్లోడ్ చేసుకొని సర్వే చేయవచ్చని అన్నారు. ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేందుకు ప్రత్యేక పోర్టల్‌ను గణన ప్రారంభానికి ముందు అందుబాటులో ఉంచనున్నట్లు స్పష్టం చేశారు.మొదటి దశలో నిర్వహించే ఇళ్ల జాబితా, గృహాల గణనలో ఇంటి నిర్మాణానికి ఉపయోగించిన పదార్థాలు, ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, తాగునీటి సౌకర్యం, మురుగు నీటి పారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంటగది సౌకర్యం వంటి వివరాలతో పాటు రేడియో, టెలివిజన్, స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్, సైకిల్, కారు లాంటి గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 34 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సేకరిస్తారని వివరించారు. మూడు రోజులలో నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి అంశాన్ని నేర్చుకుంటూ ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ ఆర్డీవోలు కృష్ణా రెడ్డి,శేఖర్ రెడ్డి, జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి మరియు జిల్లా సెన్సస్ అధికారి వెంకటరమణ , మున్సిపల్ కమీషనర్ లు,జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి,ఎంపిడిఓలు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# కమలానగర్‌లో జిమ్ పరికరాలు మాయం

**ప్రజల సొమ్ము ఎక్కడ..? బాధ్యులు ఎవరు..?**

**కుషాయిగూడ, మహా :** కాప్రా సర్కిల్ పరిధిలోని ఏఎస్ రావు నగర్ డివిజన్‌లో ఉన్న కమలానగర్ కాలనీలో ప్రజాధనంతో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు అకస్మాత్తుగా మాయమవ్వడం తీవ్ర సంచలనానికి దారితీసింది. యువత ఆరోగ్యం కోసం ప్రభుత్వం కొన్ని సంవత్సరాల క్రితం లక్షల రూపాయల ప్రజాధనంతో కమలానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో జిమ్ సదుపాయాలను ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుతం ఆ జిమ్‌లో ఉన్న పరికరాలు పూర్తిగా కనిపించకపోవడం కాలనీవాసుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన జిమ్ గదిలో పరికరాలు కొంతకాలంగా వినియోగంలో లేకపోయినా అక్కడే ఉన్నాయని స్థానికులు భావించారు. కానీ ఇటీవల గది తలుపులు తెరిచి చూడగా ఒక్క పరికరం కూడా కనిపించకపోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ప్రజల సొమ్ముతో కొనుగోలు చేసిన లక్షల రూపాయల విలువైన జిమ్ పరికరాలు ఇలా అదృశ్యం కావడం వెనుక ఎవరి హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాలనీ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

**జిమ్ పరికరాలు ఎక్కడికి తరలించబడ్డాయి..?**

ప్రజల సొమ్ముతో ఏర్పాటు చేసిన ప్రజాప్రయోజన సదుపాయాలు ఇలా మాయమవడం అత్యంత దారుణమని కాలనీవాసులు మండిపడుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపి జిమ్ పరికరాలు అదృశ్యం కావడానికి కారణమైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు వెంటనే నిజాలను బయటపెట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడానికి సిద్ధమని కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు.



# భవానీనగర్ కాలనీలో బస్తీబాట

**ప్రజా సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం**

**నెమలి అనిల్ కుమార్**

**కుషాయిగూడ, మహా:** మల్కాజ్గిరి కార్పొరేషన్ నాచారం సర్కిల్ మల్లాపూర్ 20వ డివిజన్ పరిధిలోని భవానీనగర్ కాలనీలో నిర్వహించిన బస్తీబాట కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు నెమలి అనిల్ కుమార్ పాల్గొన్నారు. కాలనీలోని ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు ప్రధానంగా ఎదుర్కొంటున్న డ్రైనేజ్ సమస్యలు, మౌలిక సదుపాయాల కొరతపై వివరించారు. వీధుల్లో నిల్వ నీరు, డ్రైనేజ్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని నివాసితులు తెలిపారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న నెమలి అనిల్ కుమార్, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని, భవానీనగర్ కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో భవానీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ నివాసితులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మల్లాపూర్‌లో ప్రధానమంత్రి విశ్వకర్మ ఓరియంటేషన్ కార్యక్రమం



- మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన
- పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ, మహా :** మల్లాపూర్ ఎస్.వి. నగర్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ భవన్‌లో "ప్రధానమంత్రి విశ్వకర్మ ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమం" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిపుణులు మహిళల సాధికారత, స్వయం ఉపాధి అవకాశాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా వివరించారు. ముఖ్యంగా ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా సంప్రదాయ వృత్తిదారులు, కళాకారులు, కార్మికులు, స్వయం ఉపాధి పొందాలనుకునే వారికి లభించే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గెస్ట్ ఆఫ్ హానర్‌గా కొత్త రామారావు పాల్గొన్నారు. భారత ప్రభుత్వానికి చెందిన ఎంఎస్ఎంఈ-డిఎఫ్ఓ, బాలానగర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగస్వాములుగా అభయా అసోసియేషన్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ సంస్థ ప్రతినిధి ధేరం ఉషా, జిల్లా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జయంతి, ఈడీపీ స్పీకర్ గణేష్, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ శోభ పాల్గొని పథకాలపై వివరించారు. అభయా సంస్థ సభ్యులు భాను, షకీలా, జయ, అనిత కార్యక్రమం నిర్వహణలో సహకరించగా, కమ్యూనిటీ సపోర్టర్లుగా సుమలత, లావణ్య, రాణి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు భవిష్యత్‌లో ఆర్థికంగా స్వావలంబన సాధించే మార్గాలను నిపుణులు వివరించారు.



# ముస్లింలకు ప్రత్యేక గుర్తింపునిచ్చింది : కేసీఆర్

**కుషాయిగూడ, మహా :** మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని నవోదయనగర్ మసీదులో ఆదివారం రంజాన్ తోఫాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జెర్రిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరుల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రంజాన్ కానుక పథకం ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని పేర్కొన్నారు. అన్ని మతాలకు సమాన ప్రాధాన్యం ఇచ్చే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని కొనసాగించడం మంచి విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ అధ్యక్షుడు అలీముద్దీన్, కార్యదర్శి నిసార్ అహ్మద్ గోరి, సలీం భాయ్, మౌలా, అఫ్రోజ్, ఇమ్రాన్, ఫరూక్, జాకీర్, మహమ్మద్ తాహెర్, ఫక్రీ, మహమ్మద్ వసీం తదితరులతో పాటు పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



# క్యాన్సర్ మహమ్మారిపై ప్రతి ఒక్కరూ పోరాడాలి

**బొంతు శ్రీదేవి యాదవ్ పిలుపు**

**కుషాయిగూడ, మహా :** కాప్రా సర్కిల్ పరిధిలోని చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఐజీ కాలనీలో మహిళల కోసం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. బొంతు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని చర్లపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆరోగ్య పరిరక్షణలో ముందస్తు పరీక్షలు కీలకమని పేర్కొన్నారు. మెడికవర్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధులపై మహిళలకు అవగాహన కల్పిస్తూ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం ప్రయోజనకరమని అన్నారు. మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపించి ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ శిబిరంలో సుమారు 120 మంది మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కె. సీతారాం రెడ్డి, ప్రభు గౌడ్, గోపాల్ యాదవ్, ప్రకాష్ రెడ్డి, భాను తదితరులు పాల్గొన్నారు. స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.



# హేమాద్రి శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శించిన మంత్రి సీతక్క

**కుషాయిగూడ, మహా :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని రాంపల్లిదాయర వెంకులోని గుట్ట హేమాద్రి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి సీతక్క దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి ఆశీస్సులు స్వీకరించిన అనంతరం మంత్రి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి దేవస్థాన అభివృద్ధి, భక్తులకు అందిస్తున్న సౌకర్యాలు, ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య వంటి అంశాలపై అర్చకులు, స్థానిక బాధ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కూడా సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మంత్రిని కలిసి ఆలయానికి సంబంధించిన కొన్ని సమస్యలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అల్పాహారం ఎక్కడ తీసుకోవాలో కూడా రాహుల్ కు తెలియదా

- ఆయన చర్యలను ఏ భారతీయుడు సమర్థించడు
- పార్లమెంట్ మెట్లపై టీ, పకోడీ తింటారా
- అస్సాం పర్యటనలో అమిత్ షా ఆగ్రహం



**మహా :** ప్రధాని మోదీని, బీజేపీని వ్యతిరేకించే క్రమంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దేశాన్ని అపఖ్యాతి పాలు చేస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మండిపడ్డారు. ఇటీవల రాహుల్ గాంధీ పార్లమెంట్ మెట్లపై టీ, పకోడీ తీసుకోవడంపై అమిత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ అనేది చాలా పవిత్ర స్థలమని, అల్పాహారం ఎక్కడ తీసుకోవాలో కూడా రాహుల్‌కు తెలియదా అని ప్రశ్నించారు. రాహుల్ చర్యలను ఏ భారతీయుడూ సమర్థించడన్నారు. అస్సాం పర్యటనలో ఉన్న హోంమంత్రి అమిత్ షా ఆ రాష్ట్ర వైద్యారోగ్య రంగానికి సంబంధించి రూ.2 వేల కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం ప్రసంగిస్తూ రాష్ట్రంలో కాంగ్రెస్ గత పాలనపై విమర్శలు గుప్పించారు. 'గత పదిహేనేళ్ల పాలనలో కాంగ్రెస్ అస్సాం వైద్యారోగ్య బడ్జెట్ నుంచి రూ.150 కోట్లు కాజేసింది. ఆ పార్టీ కేవలం తమ కుటుంబాల పాలన కోసమే పని చేసింది. ఆ సమయంలో రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేది' అని అమిత్ షా విమర్శించారు. అస్సాం రాష్ట్రంలోని వైద్య సదుపాయాలను గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాల స్థాయికి తీసుకురావడానికి సీఎం హిమంత బిశ్వశర్మ ఎంతగానో కృషి చేశారని ప్రశంసించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి అందుబాటు ధరల్లో వైద్య సేవలు అందించేందుకు బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

# హైవే ప్రయాణికులకు ఝలక్

**ఫాస్టాగ్ యాన్యువల్ పాస్ ధర పెంపు**

**హైదరాబాద్, మహా :** జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి ఎన్‌హెచ్ఏఐ ఝలక్ ఇచ్చింది. 2026 27 ఆర్థిక సంవత్సరానికి గాను ఫాస్టాగ్ యాన్యువల్ పాస్ ధరను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పెరిగిన ధరలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానున్నాయి. హైవేలపై తరచూ ప్రయాణించే వారి ఖర్చును తగ్గించేందుకు, ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు గత ఏడాది ఆగస్టు 15న ఈ వార్షిక పాస్ విధానాన్ని ఎన్‌హెచ్ఏఐ తీసుకొచ్చింది. ఈ పాస్ ఒక ఏడాది పాటు లేదా ఏవైనా నేషనల్ హైవే టోల్ ప్లాజాల వద్ద గరిష్ఠంగా 200 సార్లు ప్రయాణించడానికి ఉపయోగపడుతుంది. టోల్ చార్జీ ఎంత ఉన్నప్పటికీ ఈ పాస్ ఉన్నవారికి అదనపు భారం పడదు. నాన్‌కమర్షియల్ వాహనాల (సొంత కార్లు, జీపులు, వ్యాన్లు) వార్షిక పాస్ ధరపై 2.5 శాతం పెరుగుదల నమోదైంది. గతంలో ఈ పాస్ ధర రూ. 3,000 ఉండగా, ఇప్పుడు అది రూ. 3,075కి చేరింది. లాంచ్ అయ్యి ఏడాది కాకుండానే ఫాస్టాగ్ వార్షిక పాస్ ఫీజు పెంచడం గమనార్హం.





## ఉస్తాద్.. కోసం శ్రీలీల భారీ రెమ్యునరేషన్?

టాలీవుడ్ టాప్ హీరోయిన్లలో శ్రీలీల ఒకరు. పెళ్లి సందడి సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయిన ఈ బ్యూటీ..ధమాకా చిత్రంతో భారీ హిట్‌ని ఖాతాలో వేసుకుంది. ఆ చిత్రం రిలీజ్ తర్వాత శ్రీలీలకు వరస అవకాశాలు వచ్చాయి. రామ్, నితిన్ లాంటి యంగ్ హీరోలతో పాటు మహేశ్ బాబు లాంటి సూపర్ స్టార్ చిత్రాల్లోనూ నటించింది. దీంతో పాటు పుష్ప 2లో స్పెషల్ సాంగ్‌కి బన్నీతో స్టెప్పులేసి ఆకట్టుకుంది. ఇలా తెలుగులో బిజీగా ఉన్నప్పుడే బాలీవుడ్‌పై కన్నేసింది. అక్కడ కూడా తన టాలెంట్‌ని నిరూపించుకునే ప్రయత్నం చేస్తుంది. తెలుగులో ఆమె నటించిన తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో శ్రీలీలతో పాటు రాశీ ఖన్నా కూడా మరో హీరోయిన్‌గా నటించింది. కెరీర్‌తో తొలిసారి పవన్ కల్యాణ్‌తో కలిసి నటిస్తుంది ఈ భామ. అయితే ఈ సినిమా కోసం భారీగానే పారితోషికం పుచ్చుకుందట. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న దాని ప్రకారం.. ఉస్తాద్ భగత్ సింగ్ మూవీ కోసం శ్రీలీల రూ.2.5 నుంచి 3 కోట్ల రూపాయల రెమ్యునరేషన్ తీసుకుందట. గత సినిమాలతో పోలిస్తే..ఇది తక్కువే అని చెబుతున్నారు. ఆమె నటించిన 'జూనియర్' చిత్రానికి ఏకంగా రూ. 4 కోట్లు తీసుకుందంట. ఇక ధమాకా తర్వాత రవితేజతో కలిసి నటించిన మరో చిత్రం 'మాస్ జాతర'కు రూ. 3 కోట్లు తీసుకున్నట్లు తెలుస్తోంది.



## కొత్త సినిమాకు హెబ్బా పటేల్ గ్రీన్ సిగ్నల్..

### ఇంతకీ జోనర్ ఏంటో తెలుసా..?

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ హెబ్బా పటేల్. గ్లామరస్ పాత్రలతో, నటనకు ఆస్కారమున్న కథలతో ప్రేక్షకులను పలు కరిస్తూ మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. కుమారి 21ఎఫ్, ఓదెల రైల్వే స్టేషన్, హనీమూన్ ఎక్స్‌ప్రెస్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తుంది. ఈ బ్యూటీ తాజాగా చిత్రాలయ క్రియేషన్స్ బ్యానర్‌పై ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రొడక్షన్ నంబర్ 3గా రాబోతున్న ఈ చిత్రానికి దర్జా ఫేం మ్యాక్ (సలీం మాలిక్) దర్శకత్వం వహిస్తున్నాడు. మ్యాక్ కథ, స్క్రీన్‌ప్లే కూడా సమకూరుస్తున్నాడు. ఎమోషనల్, కామెడీ జోనర్‌లో రాబోతున్న ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. శ్రీలక్ష్మి ఎం నిర్మిస్తున్న ఈ చిత్రానికి కేవీఆర్ అడిషనల్ స్క్రీన్ ప్లే అందిస్తుండగా.. ఎం సమీర్ మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈ మూవీకి భాష్య శ్రీ మాటలు, పాటలు సమకూరుస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలోనే క్లారిటీ ఇవ్వనుంది హెబ్బా పటేల్ టీం. హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో దూసుకెళ్తున్న హెబ్బా పటేల్ ఈ సారి సిల్వర్ స్క్రీన్‌పై ఎలాంటి మ్యాజిక్ చేయబోతున్నది ఆసక్తికరంగా మారింది.



## సాయిపల్లవితో సంజయ్ లీలా చర్చలు

తమిళం, తెలుగుతోపాటు పాన్ ఇండియా స్థాయిలో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న నటీమణుల్లో టాప్‌లో ఉంటుంది సాయిపల్లవి. ఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్‌కు సంబంధించి ఏ వార్త వచ్చినా అది అభిమానులకు ట్రీట్ అనే చెప్పాలి. అందం, అభినయంతోపాటు డ్యాన్స్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేసే ఈ భామ ఇప్పటికే బాలీవుడ్ నుంచి రాబోతున్న ఎపిక్ ప్రాజెక్ట్ రామాయణలో నటిస్తుందని తెలిసిందే. తాజాగా సాయిపల్లవికి సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్ నెట్టింట రౌండప్ చేస్తోంది. ఈ భామ భారీ బయోపిక్‌లో నటించబోతుందట. పాపులర్ బాలీవుడ్ ఫిల్మ్ మేకర్ సంజయ్ లీలా భన్సాలీ ఐకానిక్ సెలబ్రిటీ మధుబాల జీవితం ఆధారంగా తెరకెక్కించనున్న సినిమాలో లీడ్ రోల్ కోసం సాయిపల్లవిని సంప్రదించాడట. ఈ బయోపిక్ కోసం ముందుగా బాలీవుడ్ భామ కియారా అద్వానీ, అనీత్ పడ్డాను సంప్రదించాలని వార్తలు రాగా.. తాజాగా సాయిపల్లవి పేరు తెరపైకి వచ్చింది. సాయిపల్లవి హిందీ డెబ్యూ సినిమా ఏక్ దిన్ 2026 మేలో విడుదల కానుంది. ఈ మూవీ విడుదల కాకముందే భన్సాలీ సినిమాకు సంబంధించిన వార్త బయటకువ రావడం అభిమానులు ఖుషీ అవుతున్నారు. సంజయ్ లీలా భన్సాలీ సినిమాలంటే హీరోయిన్ పాత్రకు ఎంత ప్రాముఖ్యత ఉంటుందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. మరి ఇప్పటికే తన నటనతో కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్న సాయిపల్లవితో సినిమా చేస్తున్నాడంటే అంచనాలు పెరిగిపోవడం పక్కా అనడంలో ఎలాంటి సందేహం లేదు. మరి రానున్న రోజుల్లో ఈ క్రేజీ బయోపిక్‌పై ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందేమో చూడాలి. ఇదే నిజమైతే సాయిపల్లవి కెరీర్‌కు ఈ మూవీ మైల్‌స్టోన్‌గా మారిపోవడం ఖాయమైనట్టేనని తెగ చర్చించుకుంటున్నారు సినీ జనాలు.



## నీరా ఆర్య బయోపిక్‌లో?

బాలీవుడ్ హీరోయిన్, భారతీయ జనతా పార్టీ ఎంపీ కంగనా రనౌత్ ప్రస్తుతం నీరా ఆర్యగా ఒదిగిపోవడానికి కసరత్తులు చేస్తున్నారని టాక్. ఎందుకంటే నీరా ఆర్య బయోపిక్‌లో నటించడానికి ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. తన కెరీర్‌లో ఎన్నో సవాల్‌తో కూడిన పాత్రలు చేసిన కంగన ప్రస్తుతం ఆచి తూచి పాత్రలు ఎంపిక చేసుకుంటున్నారు. ఇందుకు కారణం ఆమె లోక్‌సభ సభ్యురాలు కావడమే. బాధ్యతాయుతమైన ఎంపీ పదవిలో ఉన్న ఆమె గతంలోలా కాకుండా పాత్రల ఎంపికలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఇందులో భాగంగానే నీరా ఆర్య బయోపిక్‌లో నటించడానికి అంగీకరించారట. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన 'ఆజాద్ హింద్ ఫౌజ్'కు అనుబంధంగా రాణీ ఆఫ్ ఝాన్సీ మహిళా రెజిమెంట్ ఉండేది. ఇందులో కీలక సభ్యురాలిగా నీరా ఆర్య వ్యవహరించారు. భారతదేశ తొలి మహిళా గూఢచారిగా ఆమెకు పేరుంది. బ్రిటిష్ అధికారిని పెళ్లాడి, సిద్ధాంత విభేదాలతో విడిపోయిన నీరా ఆర్యని బ్రిటీష్ అధికారులు అరెస్ట్ చేసి, చిత్రహింసలకు గురిచేశారట. 1998 జూలై 26న ఆమె మృతి చెందారు. స్వాతంత్ర్య సంగ్రామంలో చూపించిన ధైర్యసాహసాలు, గూఢచారిగా అద్భుతంగా పని చేసిన వైనం... ఇలా ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన జీవితం ఆమెది. అలాంటి నీరా జీవితకథతో శివమ్ నాయర్ దర్శకత్వంలో ఓ సినిమా రానుందని సమాచారం. కంగనాని కలిసి ఆయన ఈ ప్రాజెక్ట్ గురించి వివరించగా ఆమె పచ్చజెండా ఊపారని టాక్. కంగన ప్రస్తుతం 'భారత భాగ్య విధాత' అనే సినిమా చేస్తున్నారు.

## సినీ ఇండస్ట్రీలో చేదు అనుభవం

### దర్శకుడి ప్రవర్తన నచ్చక సినిమా వదిలేశా...

### లావణ్య త్రిపాఠి



సాధారణంగా వివాదాలకు దూరంగా ఉండే హీరోయిన్ లావణ్య త్రిపాఠి తాజాగా సినీ పరిశ్రమలో తనకు ఎదురైన ఒక చేదు అనుభవం గురించి మాట్లాడి సంచలనం రేపింది. ముఖ్యంగా ఇండస్ట్రీలో ఉండే చీకటి కోణాలు, మహిళలు ఎదుర్కొనే ఇబ్బందుల గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. కరోనా సమయంలో తాను ఒక తమిళ సినిమా ఒప్పుకున్నానని లావణ్య త్రిపాఠి వెల్లడించింది. అయితే ఆ సినిమా షూటింగ్ సమయంలో దర్శకుడి ప్రవర్తన తనకు ఏమాత్రం నచ్చలేదని ఆమె తెలిపింది. షూటింగ్ స్పాట్‌లో తాను సురక్షితంగా లేనట్టుగా అనిపించడంతో పాటు అసౌకర్యంగా భావించానని పేర్కొంది. ఈ పరిస్థితుల్లో ధైర్యంగా ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవాలని నిర్ణయం తీసుకున్నానని లావణ్య చెప్పింది. అయితే సినిమా నుంచి బయటకు వచ్చిన తర్వాత పరిస్థితులు మరింత క్లిష్టంగా మారాయని ఆమె తెలిపింది. సదరు దర్శకుడు, నిర్మాతలు తనను టార్గెట్ చేసి పత్రికల్లో తప్పుడు కథనాలు రాయించారని, అంతేకాకుండా తనపై కేసులు కూడా పెట్టారని ఆమె ఆరోపించింది. ఆ సమయంలో తనకు ఎవరూ మద్దతుగా నిలవలేదని, తీవ్ర మానసిక వేదనను అనుభవించానని లావణ్య ఆవేదన వ్యక్తం చేసింది. ఈ వ్యాఖ్యలు బయటకు రావడంతో నెటిజన్లు, సినీ అభిమానులు ఈ అంశంపై చర్చిస్తున్నారు. ఇండస్ట్రీలో మహిళలు ఎదుర్కొనే సమస్యలపై మరోసారి చర్చ మొదలైంది. ఇక లావణ్య త్రిపాఠి సినిమాల విషయానికి వస్తే, మెగా హీరో వరుణ్ తేజ్‌తో వివాహం తర్వాత ఆమె నటిస్తున్న తొలి చిత్రం 'సతీ లీలావతి'. ఈ చిత్రానికి తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో దేవ్ మోహన్ హీరోగా నటిస్తున్నారు. ఆనంది ఆర్ట్స్ సమర్పణలో రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుంది. వాస్తవానికి ఈ నెలలోనే సినిమా విడుదల కావాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. పెళ్లి తర్వాత లావణ్య త్రిపాఠి నటిస్తున్న సినిమా కావడంతో ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com